ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 15-05- 2026 | సంపుటి: 17, సంచిక: 42, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

### చివరి ధాన్యం గింజ వరకు మద్దతు ధరతో

# ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి - ధాన్యం కొనుగోళ్ల కోసం 22 వేల కోట్లు కేటాయింపు**
**- హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు**
**- వచ్చే 15 రోజుల పాటు లారీలు, డీసీఎంలను ధాన్యం రవాణా కోసం వినియోగం**
**- ఖమ్మం ఐడీఓసీలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




ఖమ్మం, మే 14( ప్రజా కలం న్యూస్ )

కొనుగోలు కేంద్రంలో చివరి ధాన్యం గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనీ సాంబ శివరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 8,575 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి సుమారు 140 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు చెప్పారు. ఇందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం 22 వేల కోట్లు సిద్ధంగా ఉంచిందని తెలిపారు. ఇప్పటి వరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు 4 వేల 800 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు 45 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సాధారణంగా బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి హమాలీలు వస్తారని, ప్రస్తుతం అక్కడి పరిస్థితుల కారణంగా హమాలీల కొరత ఏర్పడిందన్నారు. తీవ్ర ఎండల కారణంగా కూడా కొంతమంది హమాలీలు పగటి వేళల్లో పనిచేయలేక పోతున్నారని తెలిపారు.

తరువాయి 2లో...



### పీఎంజే జ్యువెలరీ

# దోపిడీ కేసు ఛేదన

**- కరుడుకట్టిన అంతర్‌రాష్ట్ర ముఠా అరెస్ట్..**
**- "ది గోల్డెన్ థీఫ్" సుభోద్ సింగ్ సూత్రధారి**

కరీంనగర్ ప్రతినిధి మే 14 (ప్రజాకలం)

కరీంనగర్ నగరాన్ని కలవరపరిచిన పీఎంజే జ్యువెలరీ షాప్ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. అంతర్‌రాష్ట్ర స్థాయిలో దోపిడీలు నిర్వహిస్తున్న కరుడుకట్టిన ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, మరికొందరి కోసం ఐదు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ దోపిడీ వెనుక "ది గోల్డెన్ థీఫ్"గా పేరొందిన సుభోద్ సింగ్ కీలక సూత్రధారిగా పోలీసులు గుర్తించారు. ఈనెల 3న కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని కరీంనగర్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పీఎంజే జ్యువెలరీ షాప్‌లో ఈ దోపిడీ జరిగింది. ఈ ఘటనలో 161.4 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాభరణాలు కలిపి సుమారు రూ.82.02 లక్షల విలువైన నగలు దోచుకెళ్లారు. దోపిడీ సమయంలో సిబ్బంది ప్రతిఘటించడంతో నిందితులు కాల్పులకు తెగబడి నలుగురు ఉద్యోగులను గాయపరిచారు.

తరువాయి 2వ పేజీలో...

# ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధి

**- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన - అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు**
**- రామన్నపేట క్లస్టర్ ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

పాలేరు మే 14(ప్రజా కలం న్యూస్ )

పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం నుంచి.. ఆడబిడ్డల ఉచిత ప్రయాణం వరకు ప్రతి హామీని నెరవేరుస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం కార్పొరేషన్ 1, 59, 60 డివిజన్ల ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం రామన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి మాట్లాడారు.

**- అర్హతే ప్రామాణికం.. అండగా ప్రభుత్వం**

ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుని మూడవ ఏట అడుగుపెట్టిన సందర్భంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో పేదవాడి సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని, తమ ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదే 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. కేవలం మంజూరు చేయడమే కాకుండా, ప్రతి సోమవారం పనుల పురోగతిని బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని వివరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం 'భూభారతి' చట్టం ద్వారా ధరణి కష్టాలను తొలగిస్తున్నామని



పేర్కొన్నారు.

**- సమస్యలకు పరిష్కార వేదిక - ప్రజా దర్బార్**

నియోజకవర్గ వ్యాప్తంగా 14 క్లస్టర్లుగా విభజించి ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇది 13వ క్లస్టర్ అని మంత్రి తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

# డ్రోన్ దాడి కలకలం

## హార్ముజ్ జలసంధిలో మునిగిన భారత కార్గో నౌక

**'హాజీ అలీ'పై తెల్లవారుజామున డ్రోన్ ఎటాక్**
**మంటల్లో చిక్కుకుని నిమిషాల్లో సముద్రంలోకి నౌక**
**14 మంది సిబ్బంది లైఫ్ బోట్లతో సురక్షితంగా బయటపడిన ఘటన**
**వరుసగా వారం రోజుల్లో మునిగిన రెండో భారత నౌక**
**ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన భారత విదేశాంగ శాఖ**



న్యూఢిల్లీ, మే 14

హార్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారత్‌కు చెందిన సరుకు రవాణా నౌకపై జరిగిన డ్రోన్ దాడి అంతర్జాతీయంగా కలకలం రేపింది. బుధవారం తెల్లవారు జామున జరిగిన ఈ ఘటనలో "హాజీ అలీ" అనే భారత కార్గో నౌక సముద్రంలో మునిగిపోవడం ఆందోళనకు గురిచేసింది.

తరువాయి 2వ పేజీలో...

# బంగారం షాక్

**-దిగుమతి సుంకం పెంపుతో బంగారం, వెండి ధరల్లో భారీ ప్రభావం**
**-గ్రాముకు రూ.33 పెరిగిన బంగారం రేటు**
**-కేజీ వెండి ధర రూ.3.20 లక్షలకు చేరిక - మధ్యతరగతి కొనుగోళ్లపై తీవ్ర భారం**



న్యూఢిల్లీ, మే 14: దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగి సామాన్య, మధ్యతరగతి వర్గాలకు షాక్ ఇచ్చాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారం, వెండిపై కేంద్ర ప్రభుత్వం సుంకాలను పెంచిన నేపథ్యంలో ఈ విలువైన లోహాల ధరలు ఒక్కసారిగా పైకెగిశాయి. ఇప్పటికే అధిక ధరల కారణంగా కొనుగో ళ్లు తగ్గిపోతున్న పరిస్థితుల్లో తాజా పెంపు ప్రజలపై అదనపు భారం మోపుతోంది. మే 14 నాటికి దేశవ్యాప్తంగా బంగారం ధరలు గణనీయంగా పెరిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. మే 13తో పోలిస్తే 24 క్యారెట్ల బంగారం గ్రాముకు సగటున రూ.33 పెరుగుదల నమోదైంది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప వంటి ప్రధాన నగరాల్లో స్వచ్ఛమైన బంగారం ధర గ్రాముకు సుమారు రూ.16,233 వద్ద కొనసాగుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ.14,880 వద్ద స్థిరంగా ఉంది. ఇక వెండి ధరల విషయానికి వస్తే, స్వల్ప తగ్గుదల ఉన్నప్పటికీ మార్కెట్‌లో భారీ స్థాయిలోనే కొనసాగుతోంది. మే 14, 2026 నాటికి కిలో వెండి ధర దేశవ్యాప్తంగా సుమారు రూ.10,000 వరకు తగ్గినప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో మాత్రం కేజీ వెండి ధర రూ.3,20,100 వద్ద నిలిచింది. అంటే గ్రాము వెండి ధర సుమారు రూ.321 స్థాయిలో కొనసాగుతోంది. బంగారం, వెండి ధరలు ఒకవైపు అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులు, మరోవైపు దిగుమతి సుంకాల పెంపుతో నిరంతరం మారుతూ ఉండటంతో కొనుగోలుదారులు ఆలోచనలో పడుతున్నారు. ముఖ్యంగా వివాహాలు, పండుగల సీజన్‌కు ముందు ఈ ధరల పెరుగుదల సాధారణ ప్రజల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## మున్సిపల్ కార్మికురాలిపై వీధి కుక్కల దాడి



3లో

## కలం కౌంటర్




# నీట్ విషాదం

## నీట్ వివాదం నేపథ్యంలో విద్యార్థి ఆత్మహత్య

**లఖింపూర్ ఖేరీలో 21 ఏళ్ల హృతిక్ మిశ్రా మృతి**
**పేపర్ లీక్, రద్దు చర్చలతో దేశవ్యాప్తంగా ఆందోళన**
**ఘటనపై రాజకీయ దుమారం, సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది**




న్యూఢిల్లీ, మే 14 : నీట్-యూజీ పరీక్ష చుట్టూ కొనసాగుతున్న పేపర్ లీక్ ఆరోపణలు, రద్దు అంశాలపై దేశవ్యాప్తంగా ఉద్రిక్తత నెలకొన్న తరుణంలో మరో విషాద ఘటన చోటు చేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీకి చెందిన 21 ఏళ్ల వైద్య విద్యార్థి హృతిక్ మిశ్రా ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. వైద్యవిద్యలో డాక్టర్ కావాలన్న తన జీవిత లక్ష్యం అనిశ్చితిలో పడిపోతుం దన్న తీవ్ర మానసిక ఆవేదనతోనే హృతిక్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. నీట్ పరీక్ష చుట్టూ నెలకొన్న వివాదాలు, పరీక్ష భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం వంటి కారణాలు విద్యార్థుల్లో ఆందోళన పెంచుతున్నాయని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగానే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. మరోవైపు విద్యా వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం ఇలాంటి దుర్ఘటనలకు దారితీస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక గోవాలో కూడా మరో నీట్ అభ్యర్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనవెలుగులోకి రావడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.

### చివరి ధాన్యం గింజ వరకు మద్దతు ధరతో

# ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

మొదటి పేజీ తరువాయి...

సమస్య పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రవాణా సమస్య పరిష్కారం కోసం వచ్చే 15 రోజుల పాటు లారీలు, డీసీఎంలను ప్రధానంగా ధాన్యం రవాణాకే వినియోగించా లని నిర్ణయించినట్లు తెలిపారు. ఇసుక, సిమెంట్ తదితర రవాణాపై నియంత్రణ విధించి ధాన్యం తరలింపుకే ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈసారి పంట దిగుబడి భారీగా పెరగడంతో నిల్వ సమస్య కూడా ఎదురవుతోందన్నారు. అదనపు గోదాములు, నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం తేమ శాతం మించకుండా, శుభ్రమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. క్వింటాల్‌కు ఐదు, ఆరు కిలోల వరకు అక్రమ కటింగ్‌లు చేస్తున్నారనే సమాచారం వస్తోందని, ఇది ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం అవసరమైతే ప్రభుత్వం కొంత నష్టాన్ని భరించేందుకైనా సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వం కనీస మద్దతు ధరకు అదనంగా 500 రూపాయలు బోనస్ అందించడంతో రైతులు రికార్డు స్థాయిలో వరి సాగు చేశారని తెలిపారు. ధాన్యంతో పాటు మొక్కజొన్న కొనుగోళ్లు కూడా ప్రభుత్వం నిర్వహిస్తోందని, రైతులు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. "చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది" అని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో తాలు, తరుగు, కటింగ్‌లు అసలు ఉండకూడదని ఇప్పటికే కఠిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎక్కడైనా రైస్ మిల్లర్లు అక్రమంగా కటింగ్‌లు చేస్తే ఆయా రైస్ మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో 309 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు. ఇప్పటి వరకు 94,961 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాగా, అందులో 80 వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి గోదాములకు తరలించినట్లు వివరించారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తైన రెండు రోజులలోనే రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో 167 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లాలో పంట కోత ఆలస్యంగా ప్రారంభమైనందున ప్రస్తుతం కొనుగోళ్లు వేగం పుంజుకుంటున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల పరిమాణం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, రైతులు ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం సేకరణ జరుగు తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాలు, తరుగు పేరుతో ఎలాంటి కోతలు విధించకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రైతుల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ, రైతులకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తున్న ప్రభుత్వం ఇదేనని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్న ను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని తెలిపారు. ప్రతిపక్షాలు రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం చివరి గింజ వరకు మొక్కజొన్న కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి, కొత్తగూడెం అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్, కొత్తగూడెం ఎస్పీ బి. రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### పీఎంజే జ్యువెలరీ

# దోపిడీ కేసు ఛేదన



మొదటి పేజీ తరువాయి...

పోలీసుల దర్యాప్తులో ఈ ఘటన వెనుక బీహార్ జైలులో ఉన్న అంతర్‌రాష్ట్ర నేరగాడు సుభోద్ సింగ్ ప్రణాళిక ఉన్నట్లు తేలింది. తెలంగాణలో దోపిడీకి ముందుగా ముఠా సభ్యులు రెండు నెలల పాటు ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లో తిరుగుతూ జ్యువెలరీ షాపులు, బ్యాంకులపై రెక్కీ నిర్వహించినట్లు వెల్లడైంది. ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్‌ను మే 13న వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు రావిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలించారు. విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠా బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో బ్యాంకులు, జ్యువెలరీ షాపులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నేరాలకు ముందు నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ బైక్ నంబర్ ప్లేట్లు, తప్పుడు పేర్లతో లాడ్జిలలో బస చేయడం, ప్రత్యేక సిమ్ కార్డులు వినియోగించడం వంటి ఆధునిక పద్ధతులు అనుసరించినట్లు గుర్తించారు.

దోపిడీ కోసం నిందితులు జార్ఖండ్-పశ్చిమ బెంగాల్ సరిహద్దులో ఒక్కో సిమ్ కార్డును రూ.10 వేల చొప్పున కొనుగోలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం పెద్దపల్లి, ధర్మపురి ప్రాంతాల్లో లాడ్జిలు మార్చుకుంటూ ప్రణాళికను అమలు చేశారు. దోపిడీకి ఒక రోజు ముందు రఘునాథ్ కర్మాకర్ మహారాష్ట్రలోని గడ్‌చందూర్ ప్రాంతానికి వెళ్లి ఆరు పిస్టల్స్, మ్యాగజైన్లు తెచ్చుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ఘటన రోజున ఉదయం ఐదుగురు నిందితులు రెండు బైక్‌లపై బయలుదేరి, మార్గమధ్యంలో నంబర్ ప్లేట్లు మార్చుకుని పీఎంజే జ్యువెలరీ షాప్ వద్దకు చేరుకున్నారు. మొదట రాధే మిశ్రా అలియాస్ అభయ్ కస్టమర్‌లా షాప్‌లోకి వెళ్లి పరిస్థితిని పరిశీలించాడు. అనంతరం సంకేతం ఇవ్వడంతో మిగతా సభ్యులు ఆయుధాలతో లోపలికి దూసుకెళ్లి సిబ్బందిని బెదిరిస్తూ నగలు దోచుకున్నారు. ఉద్యోగులు ప్రతిఘటించడంతో కాల్పులు జరిపి పరారయ్యారు. హడావుడిలో ఒక నగల బ్యాగ్‌ను షాప్‌లోనే వదిలి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

దోపిడీ అనంతరం ముఠా సభ్యులు ముందుగా సిద్ధం చేసుకున్న మార్గాల్లో విడిపోయి పారిపోయారు. కొందరు గోదావరి నది దాటి మంచిర్యాల నుంచి రైలులో పారిపోగా, మరికొందరు అడవి ప్రాంతంలో క్రెటా కారులో వచ్చిన వ్యక్తులకు నగల బ్యాగ్ అప్పగించి బీహార్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతిక నిఘా, సీసీ కెమెరాల దృశ్యాలు, శాస్త్రీయ ఆధారాలు, అంతర్‌రాష్ట్ర సమన్వయంతో ఇప్పటివరకు 13 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. అరెస్ట్ చేసిన ముగ్గురి వద్ద నుంచి రూ.51 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు సిమ్ కార్డులు, ఒక నకిలీ ఆధార్ కార్డును స్వాధీనం చేసుకున్నారు.

ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్‌పై వివిధ రాష్ట్రాల్లో హత్య, దోపిడీ, ఆయుధ చట్టాల కింద ఏడు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రావిష్ కుమార్‌పై 15 కేసులు నమోదై ఉన్నాయని వెల్లడించారు. ఇంకా పరారీలో ఉన్న గ్యాంగ్ లీడర్ సుభోద్ సింగ్‌తో పాటు ఇతర నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దోచుకెళ్లిన ఆభరణాల స్వాధీనం కోసం కూడా ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీసులు బ్యాంకులు, జ్యువెలరీ షాపులు, లాడ్జిలు, అతిథి గృహాల యజమానులకు కీలక సూచనలు చేశారు. నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, ప్రైవేట్ భద్రతా సిబ్బందిని నియమించడం, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించడం, సరైన గుర్తింపు ధృవీకరణ తర్వాతే గదులు ఇవ్వడం వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కరీంనగర్ పోలీసులు శాస్త్రీయ దర్యాప్తు, సాంకేతిక విశ్లేషణతో కేసును వేగంగా ఛేదించడం ప్రశంసనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు

# ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధి

మొదటి పేజీ తరువాయి...

చిన్న చిన్న సమస్యలను వేదికపైనే పరిష్కరించేలా అధికారులను ఆదేశించడమే కాకుండా వారం రోజుల్లో పరిష్కరించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మూడు నెలల లోపు ప్రతి న్యాయమైన అర్జీని పరిష్కరించి తీరుతామని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం పరిపాలనకు సంబంధించి ప్రతి శాఖను విశ్లేషించి, ప్రజలకు మేలు చేయడమే ఈ 99 రోజుల కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.

అభివృద్ధి చూపించి మళ్లీ ఓట్లు అడుగుతా,

రెండు ఏళ్ల క్రితం ఈ డివిజన్లలో రోడ్లు, కరెంటు, తాగునీటి పరిస్థితి ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలే ఆలోచించాలని మంత్రి అన్నారు. ఇంకా కొన్ని రోడ్లు వేయాల్సి ఉందని, ఆ పనులు కూడా పూర్తి చేశాకే మళ్లీ ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతానని ఆయన స్పష్టం చేశారు. మాటలు చెప్పడం కాదు.. పని చేసి చూపించడమే తన నైజమని ఉద్ఘాటించారు.

సంక్షేమ పథకాలపై మాట్లాడుతూ,

200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీతో పాటు ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి పథకాలు ప్రతి పేదవాని ఇంటి గుమ్మానికి చేరుతున్నాయని మంత్రి తెలిపారు. విద్యార్థుల కోసం డైట్ చార్జీలను 40 శాతం, కాస్మొటిక్ చార్జీలను 200 శాతం పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అడిషనల్ డీసీపీ రామానుజం, వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ అధికారులు, ఆయా డివిజన్ల మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ దాడి కలకలం

మొదటి పేజీ తరువాయి...

సోమాలియా నుంచి షార్జాకు ప్రయాణిస్తున్న ఈ నౌకపై ఒమన్ తీరంలోని లిమా సమీపంలో డ్రోన్ దాడి జరిగినట్లు నేవీ అధికారులు వెల్లడించారు. దాడి అనంతరం భారీ పేలుడు సంభవించడంతో నౌకలో మంటలు చెలరేగి, కొద్ది నిమిషాల్లోనే సముద్రంలో మునిగిపోయిందని తెలిపారు. ఘటన సమయంలో నౌకలో మొత్తం 14 మంది సిబ్బంది ఉన్నారు. మంటలు వేగంగా వ్యాపించినప్పటికీ, సిబ్బంది అప్రమత్తమై లైఫ్ బోట్ల సహాయంతో సముద్రంలోకి దిగి ప్రాణాలను రక్షించుకున్నారు. అనంతరం ఒమన్ సముద్ర భద్రతా బృందాలు సహాయక చర్యలు చేపట్టి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం కొంత ఉపశమనంగా భావిస్తున్నారు. మునిగిపోయిన ఈ నౌక గుజరాత్ రాష్ట్రంలోని దేవభూమి ద్వారకా జిల్లాకు చెందిన " ఎమ్మెస్వి హాజీ అలీ బీడీఐ 1492"గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తుండగా ఈ దాడి జరిగినట్లు వెల్లడించారు. డ్రోన్ నౌకను ఢీకొట్టిన వెంటనే భారీ మంటలు వ్యాపించి, నౌక నియంత్రణ కోల్పోయి సముద్రంలో మునిగిపోయిందని వివరించారు. గత వారం రోజుల వ్యవధిలో హార్ముజ్ సమీపంలో మునిగిపోయిన భారత నౌకలలో ఇది రెండోది కావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. అంతకుముందు మే 8న ఇరాన్-అమెరికా మధ్య జరిగిన కాల్పుల ప్రభావంలో చిక్కుకుని "అల్ ఫైజ్ నూర్ సులేమానీ-1" అనే మరో భారత నౌక కూడా మునిగిపోయింది. ఆ నౌక దుబాయ్ నుంచి యెమెన్‌లోని ముకల్లాకు ప్రయాణిస్తుండగా ప్రమాదానికి గురైంది. వరుసగా రెండు నౌకలు దాడులకు గురికావడంతో గల్ఫ్ దేశాలతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న భారత షిప్పింగ్ రంగంలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ ఘటనపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. వాణిజ్య నౌకలు, పౌర నావికులను లక్ష్యంగా చేసుకోవడం పూర్తిగా ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. సముద్ర మార్గాల్లో ప్రయాణించే పౌర నౌకల భద్రతను అంతర్జాతీయ సమాజం కచ్చితంగా కాపాడాలని పేర్కొంది. సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే చర్యలను భారత్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ప్రమాదంలో చిక్కుకున్న భారతీయ నౌక సిబ్బందిని రక్షించిన ఒమన్ అధికారులకు భారత్ కృతజ్ఞతలు తెలిపింది. ప్రస్తుతం రక్షించబడిన సిబ్బందిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. హార్ముజ్ జలసంధిలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ వాణిజ్య రవాణాపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# బీజేపీ ఎన్నికల 'గిఫ్ట్': దేశవ్యాప్త దుమారం!



న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం దక్కించుకున్న విషయం తెలిసిందే. అయితే.. ఈ విజయం ప్రజలు ఇచ్చింది కాదని.. ఈవీఎంలు, కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన విజయంగా బీజేపీ నాయకులపై మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు.. మమతా బెనర్జీ ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే.. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం మౌనంగా ఉంది. ఇదిలావుంటే.. తాజాగా బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఒకప్పటి తృణమూల్ కాంగ్రెస్ కీలక నాయకుడు.. సువేందు అధికారి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా.. మనోజ్ అగర్వాల్‌ను నియమించారు. ఈ నియామకమే ఇప్పుడు తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ నియామకాన్ని.. ఎన్నికల గిఫ్ట్‌గా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సహా.. కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ నిప్పులు చెరుగుతున్నారు. దీని వెనుక ఎన్నికల ప్రభావం ఉందని ఆరోపిస్తున్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా మనోజ్ అగర్వాల్ వ్యవహరిం చారు. ఆ సమయంలోనే ఎన్నికల వ్యవహారంలో అవకతవకలు జరిగాయని టీఎంసీ పెద్ద ఎత్తున ఆరోపణ లు చేసింది. ఇక, కేంద్ర ఎన్నికల సంఘం.. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు మనోజ్ అగర్వాల్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా నియమించడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఎన్నికలు అలా ముగిసి.. కొత్త ప్రభుత్వం ఇలా ఏర్పడగానే అగర్వాల్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై తీవ్ర దుమారం రేగింది. రాజ్యసభ అభ్యర్థులపై ఉత్కంఠ ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. వాస్తవానికి బెంగాల్ ఎన్నికలపై నిన్న మొన్నటి వరకు మౌనంగా ఉన్న రాహుల్ ఇప్పుడు మాత్రం గళం వినిపించడం గమనార్హం. మరోవైపు రాష్ట్ర స్థాయిలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కూడా.. ఇది ఎన్నికల బహుమానం అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ఇక, నిబంధనల మేరకు.. ఎన్నికల ప్రధాన అధికారులుగా పనిచేసిన వారిని.. తక్షణం కీలక పదవుల్లో నియమించడాన్ని సుప్రీంకోర్టు గతంలో తప్పుబట్టిన విషయం ప్రస్తావనార్హం.

# బీజేపీ ఎఫెక్ట్: పళని స్వామికి ఎసరు!



న్యూఢిల్లీ : బీజేపీ చేయి పడితే.. అయితే ముఖ్యమంత్రి అయినా అవుతారు. లేకపోతే ఎటూ కాకుండా అయినా పోతారన్న వాదన రాజకీయాల్లో ఉంది. ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో బీజేపీ ప్రభావం కూడా ఇలానే ఉంది. ఒకప్పుడు బీజేపీ మద్దతుతో ముఖ్యమంత్రి పీఠం దక్కించుకున్న అన్నాడీఎంకే కార్యదర్శి.. పళని స్వామి.. ఇప్పుడు అదే బీజేపీ ప్రభావంతో తన ఉనికిని కోల్పోయే పరిస్థితిని తెచ్చుకున్నారు. తాజాగా అన్నాడీఎంకే రెండుగా చీలిపోయింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాల్లో విజయం దక్కించుకుని మూడో స్థానానికి పరిమితమైన పార్టీలో.. పళనిపై ఆగ్రహ జ్వాలలు మిన్నంటాయి. అసలు ఈ దుస్థితికి కారణం.. ఆయనేనని సీనియర్ నాయకుడు షణ్ముగం వ్యాఖ్యానిం చారు. ఎన్నికలకు ముందు.. బీజేపీతో పొత్తు వద్దని తాము నెత్తీ నోరు కొట్టుకున్నామని.. టీవీకేతో చేతులు కలుపుదామని కూడా చెప్పామని కానీ.. తాను మునిగి.. తమను కూడా పళని స్వామి ముంచేశారని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే 47 మంది ఎమ్మెల్యేలలో 30 మంది షణ్ముగం తన దారిలోకి తెచ్చుకున్నారు. ఆ వెంటనే తననే శాసన సభా పక్ష నాయకుడిగా గుర్తించాలని స్పీకర్‌కు లేఖ అందించారు. అంతేకాదు.. తాము అధికార టీవీకే పార్టీకి మద్దతు ఇస్తున్నామని.. పళని స్వామితో తమకు సంబంధం లేదని కూడా అసెంబ్లీ సాక్షిగా తేల్చేశారు. ఇక్కడితో కూడా ఆగకుండా.. తమదే అసలైన అన్నాడీఎంకే అని కూడా ప్రకటించుకో వడం గమనార్హం. రాజ్యసభ అభ్యర్థులపై ఉత్కంఠ జయలలిత హయాంలో ఆమె బీజేపీని ఎక్కువగా టార్గెట్ చేశారు. ముఖ్యంగా మోడీ ప్రధాని అయిన తర్వాత.. రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని.. రాష్ట్రాల సొమ్ములు దోచేస్తున్నారని. .కేంద్రం పై పెద్ద యుద్ధమే ప్రకటించారు. ఈ క్రమంలోనే ఆమెపై ఉన్న అవినీతి కేసులు పుంజుకుని జైలుకు వెళ్లారు. అనంతరం.. ఆమె మృతి చెందారు. దీంతో బీజేపీపై అన్నాడీఎంకేలో వ్యతిరేకత ఉంది. కానీ, తన రాజకీయం కోసం పళని స్వామి అదే బీజేపీతో తొలినాళ్లలో తెరచాటున, తాజాగా బహిరంగంగా పొత్తు పెట్టుకున్నారు. ఈ ప్రభావంతోనే అధికారంలోకి వస్తుందని లేదా కనీసం రెండవ స్థానంలో అయినా ఉంటుందని భావించిన పార్టీ ఇప్పుడు మూడో స్థానానికి దిగిపోయింది. ఈ నేపథ్యంలో బీజేపీని వ్యతిరేకించే వర్గం కూటమికట్టి పార్టీని సొంతం చేసుకుంది.

# తిరుమలలో డిజిటల్ దొంగలు.. సర్కారుకు బ్యాడ్ నేమ్!



తిరుమల : తిరుమల పవిత్ర క్షేత్రాన్ని దర్శించుకుని.. ఏడుకొండలవాడి దర్శనం కోసం తపించి పోయే.. భక్తుల వీక్ నెస్‌ను కొందరు దొంగలు.. తమకు లాభార్జనగా మార్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే తిరుమల శ్రీవారి దర్శన టోకెన్లను ముందుగానే బుక్ చేసుకుని.. వాటిని దొడ్డిదారిలో విక్రయిస్తున్నారు. ఒకరకంగా.. ఇది తిరుమల డిజిటల్ దొంగలకు ఆవాసంగా మారిందన్న సంకేతాలను ఇస్తోంది. ఏం చేస్తారు? తిరుమలలో శ్రీవారిని దర్శించుకునేందుకు వివిధ రకాల టికెట్లు అందుబాటులో ఉంటున్నాయి. నెలకు ఒకసారి ఆర్జిత సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వీటితో పాటు.. ప్రతి రోజూ ప్రస్తుతం అత్యంత ఖరీదైన రూ.10 వేల టికెట్లను శ్రీవాణి-రూపంలో తిరుమల అధికారులు.. ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నారు. రోజుకు ఉండే రద్దీని దృష్టిలో పెట్టుకుని.. ఈ టికెట్లను 800 వరకు విడుదల చేస్తారు. ఈ టికెట్ తీసుకున్న వారి కుటుంబంలోని ఐదుగురు వరకు శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉంటుంది. దీంతో ఈ టికెట్ల కోసం భక్తుల్లోనూ డిమాండ్ ఎక్కువగా ఉంది. దీనిని ఆసరా చేసుకున్న డిజిటల్ దొంగలు.. టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయడానికి ముందుగానే.. తాము ముందుగానే కుదుర్చుకున్న బేరం ప్రకారం.. భక్తుల నుంచి వివరాలు సేకరించి.. 'ఆటోఫిల్లింగ్' యాప్ ద్వారా ఆయా వివరాలను సిద్ధం చేసుకుంటారు. అంతేకాదు.. వాస్తవానికి ఆన్‌లైన్ ఈ టికెట్లను విడుదల చేయడానికి 10 నిమిషాల ముందుగానే వీరు టికెట్లను బుక్ చేసుకుని ఒక్కొక్క టికెట్‌పై 3 నుంచి 5 వేల రూపాయలను గడిస్తున్నారు. దీంతో సాధారణ భక్తులకు ఈ టికెట్లు లభించడం లేదు. తిరుమలలో గత కొన్నాళ్లుగా ఈ వ్యవహారం నిరాఘాటంగా సాగిపోతోంది. దీని వెనుక పెద్ద తలకాయలనే ఉన్నాయని.. రోజుకు 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు దొడ్డిదారిలో సంపాయించుకుంటున్నారని.. విజిలెన్స్ అధికారులు లెక్కలు తీశారు. దీనిని అరికట్టేందుకు పెద్ద ఎత్తున విచారణ జరగాల్సి ఉందని చెబుతున్నారు. ఆలయంలో రెండో, మూడో గ్రేడ్ అధికారుల ప్రమేయంతోనే ఇదంతా జరుగుతున్నట్టు చెబుతున్నారు. మొత్తంగా ఆలయ అధికారులు, సిబ్బంది కుమ్మక్కయి.. ఈ దొడ్డిదారి వ్యాపారం చేస్తూ.. ఆలయ పవిత్రతను దెబ్బతీస్తున్నారని అధికారులు ప్రభుత్వానికి తెలియజేశారు.

# బడిబాటలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి, మే 14 (ప్రజాకలం) : విద్యా వారోత్సవాలలో భాగంగా బుధవారం నాలుగవ రోజు నిర్వహించిన బడిబాట మరియు మెగా పీటీఎం కార్యక్రమంలో గౌరవ జిల్లా విద్యాశాఖ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోరుట్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడ నిర్వహిస్తున్న డోర్ టు డోర్ సర్వే క్యాంపెయిన్‌లో భాగస్వామ్యమయ్యారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో అత్యుత్తమ హాజరు శాతం నమోదు చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తూ సర్టిఫికెట్లతో సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను ప్రశంసిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తదుపరి పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఎస్సి రెమెడియల్ తరగతులను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కాలాన్ని సద్వినియోగం చేసుకొని రాబోయే పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడంతో పాటు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

# తడచిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు

### రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 14 (ప్రజా కలం) నియోజకవర్గంలో నిన్న అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం వల్ల తడిచిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలోని మెట్ పల్లి మండలం విట్టంపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిన్న రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని అధికారులతో టెలిఫోన్ ద్వారా మాట్లాడి ధాన్యం కొనుగోలుకు తక్షణం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం స్థానిక సర్పంచ్ చిరంజీవి స్థానిక గ్రామ పంచాయతీకి చెందిన వార్డు సభ్యులు మాజీ ఎంపీటీసీ వీడీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# అల్లిపూర్‌లో ఘనంగా శ్రీ పెద్దమ్మతల్లి జాతర బోనాలు

### - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ బోగ శ్రావణి



జగిత్యాల్ ప్రతినిధి మే 14 (ప్రజాకలం) రాయికల్ మండలంలోని అల్లిపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పెద్దమ్మతల్లి జాతర బోనాలు మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ బోగ శ్రావణి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజల సుఖశాంతులు, రైతుల అభివృద్ధి, యువతకు మంచి భవిష్యత్తు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. జాతర సందర్భంగా గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయ బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించగా, డప్పుల మోతలు, మంగళ వాయిద్యాలు, భక్తి గీతాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఈ సందర్భంగా డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. గ్రామ పెద్దలు, ముదిరాజ్ సంఘం నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# చలో జగిత్యాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మల్లాపూర్ మే 14 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో "చలో జగిత్యాల" కార్యక్రమంపై మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథి గా కోరుట్ల నియోజకవర్గ నాయకులు పుదరి నిశాంత్ కార్తికేయ హాజరయ్యారు. మే 18వ తేదీ సోమవారం నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేపట్టనున్న దీక్షకు మద్దతుగా భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మల్లాపూర్ బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, నాయకులు శివ, గుగులావత్ రాజేందర్, భూక్యా రాజశేఖర్, ఎర్ర రాజు, ఇల్లేందుల మనోజ్ కుమార్, గాండ్ల గంగరాజు, గజ్జి శీను, గడ్డం నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### వరి ధాన్యం కొనుగోలు..రవాణా అన్‌లోడింగ్ ప్రక్రియలను

# వేగవంతంగా పూర్తి చేయాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 14 (ప్రజా కలం) జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అన్నారు. గురువారం కోరుట్ల మండలంలోని జోగిన్‌పల్లి గ్రామంలో ఉన్న మూడు రైస్ మిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలిసి రైస్ మిల్లులను సందర్శించి మిల్లులల్లో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. మూడు మిల్లులలో రెండు పాయింట్ల వద్ద అన్‌లోడింగ్ కొనసాగుతుండగా, నిన్న రాత్రి, ఈరోజు ఉదయం చేరుకున్న 6 నుండి 8 వాహనాలు వేచివున్నట్లు గుర్తించారు. మిల్లులకు చేరుకున్న ప్రతి వాహనాన్ని 15 నుండి 18 గంటల వ్యవధిలో అన్‌లోడ్ చేస్తున్నట్లు మిల్లర్లు, అధికారులు వివరించారు. ధాన్యం రవాణా మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత మిల్లర్లకు సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం మాధాపూర్ ఐకేపీ పీపీసీ కేంద్రం మరియు పైడిమడుగు ప్యాక్స్ పీపీసీ కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి



తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా మరియు వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

అనంతరం జోగిన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అదేవిధంగా మంజూరు అయినా లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్,డిటి, ఏపిఎం, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కష్ట పడే విద్యార్థులకు ఆదర్శం మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 14 (ప్రజాకలం) కష్టపడి పని చేస్తూ,చదువుతున్న విద్యార్థులకు మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆదర్శమని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా శాఖ అధ్వర్యంలో జరుగుతున్న విద్యా వారోత్సవాల వేడుకల సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల సంఘం సమావేశం కళాశాల ప్రిన్సిపాల్ కే.వేంకయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కొందరు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ,ఈ కళాశాలలో చదువుకునే విద్యార్థులు కష్టపడి పార్ట్–టైమ్ గా పని చేస్తారని, దాంతో వారు కొంత ఆదాయాన్ని కూడా సంపాదిస్తారని గుర్తు చేశారు.అంతే కాక పిల్లలున్న తల్లులు కూడా ఈ కళాశాలలో విద్యార్థులుగా చేరడంతో ఉత్తీర్ణత సాధించడంతో పాటు సమాజంలో మంచి పేరు సంపాదించి,ఆ విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.ఈ కళాశాలలో చేరడంతో విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు అయ్యాయని, దాంతో వాళ్ళు ఆర్థికంగా ప్రగతిని సాధించారని గుర్తు చేశారు.అన్ని సబ్జెక్టులు ఒకేసారి ఉత్తీర్ణులు కావడంతో విద్యార్థులకు కలిగే సంతోషాన్ని వర్ణించలేమని అన్నారు. కళాశాల సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించడంతో అన్ని విషయాల్లో కళాశాలలో బేపిజం అన్నదే కానరాదని వారు పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం కళాశాల సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని ఈ సమావేశంలో విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ప్రకటించారు. ఈ సంవత్సరం విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పిస్తామని వారు ఈ సమావేశంలో హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధికోసం శాయ శక్తులా కృషి చేస్తామని, సిబ్బంది సహకారంతో పేద విద్యార్థులకు అన్ని రకాల సహాయ, సహకారాలను అందిస్తామని అన్నారు.విద్యార్థులే కళాశాలకు పునాది అని ప్రిన్సిపాల్ కొనియాడారు. ఈ సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న, కళాశాల అకాడమిక్ కో– ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, దోస్త్ కో – ఆర్డినేటర్ మనోజ్ కుమార్, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు యాదగిరి, మమత, కృపాల్‌లతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యా శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి యోగితా రాణా, కళాశాల విద్యా కమిషనర్ అల్లంరాజు దేవసేన, సీ సీ ఈ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ రాజేందర్ సింగ్, ప్రొఫెసర్ బాల భాస్కర్ లతో పాటు విద్యా శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ కార్మికురాలిపై వీధి కుక్కల దాడి

### - ముఖం.. కాలికి తీవ్ర గాయాలు

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 14 (ప్రజాకలం) పట్టణంలోని ఆరవ వార్డులో పారిశుధ్య కార్మికురాలు స్వప్నపై గురువారం ఉదయం వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడం వల్ల స్వప్న ముఖం, కాలిపై తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని స్వప్నను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ యంత్రాంగం పారిశుద్ధ్య కార్మికురాలు స్వప్నకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**వీధి కుక్కల తరలింపులో మున్సిపల్ పాలక పక్షం విఫలం**

**ప్రధాన సమస్యపై పాలక పక్షానికి కరువైన ముందుచూపు**

మెట్ పల్లి పట్టణంలోని పలు వార్డుల్లో తరచు వీధి కుక్కలు దాడి చేస్తున్న పట్టించుకునే పాలకుల కరువయ్యారని ఆరోపణలు వినవస్తున్నాయి. గత కొద్ది రోజులుగా క్రితం వార్డులో వీధి కుక్కలు దాడి చేయగా బాలునికి తీవ్ర గాయాలు అయ్యాయి. అయితే గాయపడిన వారిని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేయడమే తప్ప వీధి కుక్కల నియంత్రణపై పాలకులు ఏమాత్రం పట్టింపు



లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని ఆరో వార్డులో ఉదయం పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న స్వప్న పై వీధి కుక్కలు దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయాల పాలయ్యింది. నిత్యం ఏదో ఒకచోట వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్న వాటి నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంపై మెట్ పల్లి పట్టణ మున్సిపాలిటీ పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో విపరీతంగా పెరిగిపోయిన వీధి కుక్కల వల్ల వార్డుల్లో కలియతిరిగే చిన్నారులపై దాడులు చేయడం వల్ల తీవ్ర గాయాల పాలు కావడంతో పాటు ఒక్కోసారి తీవ్ర ప్రాణ నష్టం కూడా జరుగుతుంది అయినప్పటికీ ప్రధాన సమస్యపై పాలక పక్షానికి ముందుచూపు లేకపోవడంపై పట్టణ ప్రజలకు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల తరలింపు, నియంత్రణకు మెట్ పల్లి మున్సిపల్ పాలకపక్షం చర్యలు తీసుకునేలా జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

### - అనుమతులు లేకుండా పని చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

ధర్మారం, మే 14 : ( ప్రజా కలం ప్రతినిధి ) ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామ శివారు లో గురువారం రోజున ఉదయం 8:30 నమ్మక మయిన సమాచారం మేరకు మల్లాపూర్ గ్రామ శివారు లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జేసీబీ సహాయం తో ట్రాక్టర్ల లో మట్టిని నింపి తర లిస్తున్నారు అన్న సమాచారం మేరకు ధర్మారం ఎస్ ఐ సిబ్బంది తో వెళ్లి




అక్కడ అక్రమంగా మట్టి తోడి ట్రాక్టర్ లో నింపుతున్న ఒక జేసీబీ, మట్టి తో నిండి ఉన్న ఒక ట్రాక్టర్, మట్టి నింపికోవడానికి వచ్చిన మరో రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని వాటి పైన తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు పంపినట్లు ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# ఫుట్ పాత్ లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

### - మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 14 (ప్రజాకలం) వ్యాపారులు తమ దుకాణం సామాగ్రిని రోడ్లపై వరకు పేర్చడం, రహదారులను ఆక్రమించే విధంగా బోర్డులను ఏర్పాటు చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ 22వ వార్డు, 12వ వార్డు, 6వ వార్డులలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అలాగే ఫుట్ పాత్ లను ఆక్రమణ చేసుకొని రోడ్లపైన ఏర్పాటు




చేసిన అడ్వర్టైజ్మెంట్ బోర్డ్ లను పెట్టడం వలన ప్రజలకు ఇబ్బంది కలుగుచున్నందున బోర్డులను పరిశీలించి సిబ్బందిచే తొలగించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పలు వార్డులలో పర్యటించి మురికి కాలువలు తీయటాన్ని పరిశీలించి ఫుట్ పాత్ లను ఆక్రమించుకొని రోడ్లపై అడ్వటైజ్మెంట్ బోర్డులను పెట్టడం వలన ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని తక్షణమే బోర్డులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. జ్యూస్ బండ్లు, పానీపూరి బండ్లు, తోపుడు బండ్లను రోడ్లపై పెట్టిన మున్సిపల్ సిబ్బందిచే తొలగించాలని సూచించారు. అలాగే వార్డులలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ చిట్యాల రాజ్ కుమార్, ముజీబ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణను విజయవంతంగా పూర్తి చేయాలి

### - జాతీయ ఎన్నికల సంఘం కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్




జగిత్యాల ప్రతినిధి మే 14 (ప్రజాకలం)

రాబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా ఎన్నికల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు యాప్‌ను ఏ విధంగా ఉపయోగించాలి, వివరాలను ఎలా నమోదు చేయాలి, ఫీల్డ్ స్థాయిలో సమాచారం సేకరణ విధానం తదితర అంశాలపై అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, వేగం, సమన్వయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ఎన్నికల అధికారులు పలు సూచనలు చేశారు. ఎన్నికల సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఏవో కిషన్, పి. నరేశ్, మమత, ఐటీ టీమ్ సభ్యులు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి గ్రామంలో దారుణం

### - నువ్వుల వివాదంతో 59 ఏళ్ల మహిళా ఆత్మహత్య

లిమెట్ పల్లి రూరల్, మే 14:(ప్రజా కలం):చిన్నపాటి కుటుంబ కలహం ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. నువ్వులు ఆరబెట్టే విషయంలో భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ మనస్థాపానికి గురిచేయడంతో ఓ వృద్ధురాలు కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మెట్ పల్లి



మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన గుండెల లక్ష్మి (59), ఆమె భర్త రాజన్నకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బుధవారం (మే 13) మధ్యాహ్నం సమయంలో ఇంటి బయట నువ్వులు ఆరబెట్టే విషయమై దంపతులిద్దరి మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. ఈ గొడవతో తీవ్ర మనస్థాపానికి గురైన లక్ష్మి మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది.కుటుంబ సభ్యులు ఆమె కోసం పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. కాగా, గురువారం ఉదయం 6 గంటల సమయంలో రాజేశ్వరరావుపేట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ వరద కెనాల్‌లో లక్ష్మి మృతదేహం లభ్యమైంది. మనస్థాపంతో ఆమె కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. తన అక్క మరణంపై ఎవరికీ ఎటువంటి అనుమానాలు లేవని మృతురాలి చెల్లెలు ఆసరి గౌరు (చింతల్‌పేట్ నివాసి) పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఎస్సై నవీన్ కుమార్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

# పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి..




మల్లాపూర్ మే 14 ( ప్రజా కలం ప్రతినిధి) ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి లో రాణిస్తున్నారు అని ప్రభుత్వ పాఠశాల లోనే పిల్లలను చదివించాలని కొత్త ధాం రాజ్ పల్లి జెడ్పీ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ ఎగ్యరపు లింబాద్రి తో కలిసి బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమం లో భాగంగా ఉపాధి హామీ కార్మికుల వద్ద కి వెళ్లి విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలు, సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా కలం
శుక్రవారం, మే 15, 2026

# మోడీ గోల్డన్ స్ట్రోక్

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థను ఊపిరి ఆడనివ్వకుండా చేస్తోంది. పెరుగుతున్న నిర్మాణ వ్యయం, ముడిసరుకు కొరత, విదేశీ మారక నిల్వలపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అత్యంత కఠినమైన నిర్ణయాల వైపు అడుగులు వేస్తోంది. మరో వైపు కేంద్రం బంగారం విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. బంగారం, వెండి, ప్లాటినం దిగుమతుల మీద సుంకం రెట్టింపు చేసింది. ఇప్పటిదాకా అది ఐదు శాతం మాత్రమే ఉండేది. ఇప్పుడు ఏకంగా 10 శాతానికి పెరిగిపోయింది. ఇది మంగళవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది. ఆభరణాల తయారీకి వాడే వస్తువులు.. ఇతర లోహాలు.. పారిశ్రామిక దిగుమతులకు కూడా ఇది వర్తిస్తుంది. దీంతో దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.. ఇప్పటికే బంగారం ధర (24 క్యారెట్లు) 1,40,000 మించి ట్రేడ్ అవుతోంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఆ ధర మరింత పెరిగే అవకాశం ఉంది.బంగారం దిగుమతులు పెరుగుతుండడం కేంద్ర ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ధరలు పెరుగుతున్నప్పటికీ చాలామంది బంగారం మీద ఇన్వెస్ట్ చేస్తున్నారు. మార్కెట్ నిపుణులు కూడా బంగారం మీద ఇన్వెస్ట్ చేయాలని సూచనల మీద సూచనలు చేస్తున్న నేపథ్యంలో.. చాలామంది ఇతర రంగాలను పక్కనపెట్టి.. కేవలం బంగారం మీద మాత్రమే ఇన్వెస్ట్ చేస్తున్న నేపథ్యంలో.. ఇతర రంగాలలో కొనుగోళ్లు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో ఆయా రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి అంతగా సాగడం లేదు. అందువల్లే కేంద్రం ఈ నిర్ణయం తీసుకొని ఉంటుందని తెలుస్తోంది. బంగారం కొనుగోళ్లు ఏడాదిపాటు తగ్గిపోతే మన దేశానికి సంబంధించిన విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరుగుతాయని కేంద్రం అంచనా వేస్తోంది.కేవలం బంగారం, ఇతర ఖరీదైన లోహాలు మాత్రమే కాదు.. ఆహార పదార్థాల ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. దేశంలో ఏప్రిల్ నెలకు సంబంధించి రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా నాలుగు నెలల గరిష్టానికి చేరుకుంది. నాలుగు నెలల క్రితం ఇది 3.48 శాతంగా ఉండేది. జనవరిలో 2.74 శాతంగా ఉండేది. దీనికి ప్రధాన కారణం ఆహార ధరల పెరుగుదలే. వరుసగా ఆలు.. ఉల్లి.. టమాటా ధరలు క్రాష్ అయ్యాయి. మిగతా ఉత్పత్తుల ధరలు పెరిగాయి. దీంతో నాలుగు నెలల్లో ఆహార ద్రవ్యోల్బణం గడిచిన నాలుగు నెలల్లో 2.13 శాతం నుంచి 4.2 శాతం వరకు పెరిగింది. జ్యువెలరీ, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్స్ వంటి వాటిపై ఏప్రిల్ లో ద్రవ్యోల్బణం 53.61 శాతానికి చేరుకుంది. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నిర్మాణ పనులను రెండేళ్ల పాటు నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సిఫార్సు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది.నీతి ఆయోగ్ సిఫార్సుల ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ సెక్రటేరియట్ పునర్నిర్మాణ పనులను కూడా ప్రస్తుతానికి వాయిదా వేయనున్నారు. నిర్మల్ భవన్, ఉద్యోగ్ భవన్ వంటి భవనాల కూల్చివేత, కొత్త నిర్మాణాలను వాయిదా జాబితాలో చేర్చారు. యుద్ధం కారణంగా స్టీల్, సిమెంట్ వంటి ముడిసరుకుల సరఫరాలో అంతరాయం కలగడం, దిగుమతి ఖర్చులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుత ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కీలక విన్నపం చేశారు. విదేశీ వస్తువుల వాడకాన్ని తగ్గించి, స్వదేశీ వనరులపై ఆధారపడాలని కోరారు. ముఖ్యంగా ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు పాఠశాలలకు ఆన్‌లైన్ తరగతులను నిర్వహించాలని సూచించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కోవిడ్ కంటే భయంకరమైన సంక్షోభం ఇదని ప్రధాని వ్యాఖ్యానించడం తీవ్రతకు అద్దం పడుతోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదనలు, యుద్ధ ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. సెన్సెక్స్ ఏకంగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు మండుతుండటంతో భారత రూపాయి విలువ ఆల్ టైమ్ లో 95.28 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది సామాన్యులపై నిత్యావసర వస్తువుల ధరల భారం పెంచే ప్రమాదం ఉంది.మరోవైపు, ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తున్నాయి. నిర్మాణ రంగం ఆగిపోతే లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని, ఆన్‌లైన్ క్లాసుల వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నాయి. ఒక దేశం వద్ద ఉన్న విదేశీ మారకద్రవ్యం, బంగారం, ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ వద్ద ఆదేశానికి సంబంధించిన కరెన్సీ హక్కులు, ఐఎంఎఫ్ లో సభ్యత్వం తీసుకున్నప్పుడు.. ఆ దేశం రిజర్వ్ చేసిన సొమ్ములో 25 శాతం. ఇలా ఈ నాలుగింటిని కలిపి విదేశీ మారక ద్రవ్య నిల్వలు అని పిలుస్తుంటారు.. ఇవి ఒక దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంటాయి. వీటిని అంచనా వేసి ఆ దేశం ఆర్థికంగా ఏ స్థాయిలో ఉందో అన్ని పనులు అంచనా వేస్తారు..మూడీస్, ఎస్ అండ్ పీ, ఫిచ్ వంటి సంస్థలు ఫారెక్స్ రిజర్వ్ అధికంగా ఉన్న దేశాలకు అద్భుతమైన రేటింగ్ ఇస్తాయి. ఈ రేటింగ్ గనక అధికంగా ఉంటే.. ఆదేశాలకు తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తుంటాయి. ఉదాహరణకు మనం లోన్ కోసం బ్యాంకు దగ్గరికి వెళ్తే.. మన సిబిల్ స్కోర్ చూస్తుంటారు. అది బాగుంటే బ్యాంక్ అధికారులు లోన్ వెంటనే మంజూరు చేస్తుంటారు. ఇదే విధానాన్ని దేశాలకు కూడా అప్పులు ఇచ్చే సంస్థ పాటిస్తుంటాయి.ఒక దేశంలో విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గిపోతున్నాయంటే.. విదేశీ పెట్టుబడిదారులు తాము పెట్టిన ఇన్వెస్ట్మెంట్ మొత్తాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు లెక్క. ఒక దేశానికి సంబంధించి ఏడు నుంచి పది నెలల వరకు క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేయడానికి డబ్బులు ఉంటే.. ఆ దేశానికి సంబంధించిన పరపతి బాగున్నట్టు లెక్క. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనదేశ విదేశీ మారకద్ర నిల్వలు బాగానే ఉన్నాయి. పశ్చిమ ఆసియాలో యుద్ధాలు ముగిసే పరిస్థితి కనిపించకపోవడంతో క్రుడ్ ఆయిల్ ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఎరువుల ధరలు కూడా భారీగా పెరుగుతాయని సమాచారం. దీనివల్ల ఫారెక్స్ నిల్వలు మరింత దారుణంగా కరిగిపోయే ప్రమాదం ఉంది.మన దేశానికి విదేశాల నుంచి వచ్చే డబ్బులో గల్ఫ్ ప్రాంతం నుంచి అధికంగా వస్తుంది. అక్కడ యుద్ధం వల్ల పరిస్థితులు మారిపోయాయి. మనవాళ్లు పంపే డబ్బు పూర్తిగా తగ్గిపోయింది. పైగా మన ఎగుమతుల వల రావాల్సిన డాలర్ల ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. దీనివల్ల మనకు రావలసిన డబ్బు రాకపోగా.. ఉన్న డబ్బు ఖర్చు అవుతుంది. అందువల్లే ప్రధానమంత్రి ఆ స్థాయిలో హెచ్చరికలు చేశారు.అయితే, దేశ ఆర్థిక భద్రత దృష్ట్యా ఈ కఠిన నిర్ణయాలు తప్పవని బీజేపీ వర్గాలు సమర్థించుకుంటున్నాయి.

# ధాన్యం కొనుగోలులో జాప్యం వద్దు



## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,మే 14:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు,లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ఐజి గోదాములను,మంథని మండలం పుట్టపాక గ్రామంలోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని,మంథని మార్కెట్ యార్డు సందర్శించి ధాన్యం కొనుగోలు,నిల్వలు, లిఫ్టింగ్ పరిస్థితులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మంథని మార్కెట్ యార్డు మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద వేగవంతంగా కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కువకాలం కేంద్రాల వద్ద నిల్వ ఉంచకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ధాన్యం స్టాక్ పెండింగ్‌లో లేకుండా చూడాలని తెలిపారు.ప్రస్తుత రోజుకు సుమారు 70 లారీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని,అదనంగా మరో 30 నుంచి 40 లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్టీఓ శాఖ,రవాణా ఏజెన్సీలకు సూచించారు.డీసీఎం వాహనాలను కూడా ధాన్యం రవాణాకు మళ్లించాలని ఆదేశించారు.అవసరమైతే కొద్ది రోజులపాటు ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను కూడా ధాన్యం రవాణాకు వినియోగించాలని తెలిపారు.కొనుగోలు కేంద్రానికి సమీపంలోనే రైస్ మిల్లులు ఉన్నచో ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు,రవాణా,లిఫ్టింగ్ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు.అనంతరం మంథని మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు దొంతులవాడలో జరుగుతున్న జనాభా లెక్కల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.తరువాత మంథని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని,వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ పర్యటనలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, నయేందర్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ మనోహర్,తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# పాఠశాలల వికాసానికి 'ప్రజాపాలన' ఊతం

## - సృజనాత్మకతకు వేదికగా విద్యా వారోత్సవాలు

పెద్దపల్లి,మే14:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో నిర్వహించిన విద్యా వారోత్సవాల నాలుగవ రోజు కార్యక్రమాలు అత్యంత విజయవంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 510 పాఠశాలలు,కళాశాలల్లో నిర్వహించిన మెగా పీటీఎం తల్లిదండ్రుల సమావేశం కార్యక్రమాల్లో 4,395 మంది తల్లిదండ్రులు,534 మంది పూర్వ విద్యార్థులు,771 మంది ప్రజాప్రతినిధులు పాల్గొని పాఠశాలల అభివృద్ధిపై చర్చించారని ఆమె వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించిన 128 కెరీర్ గైడెన్స్ సదస్సుల ద్వారా 2,122 మంది విద్యార్థులు ఉన్నత విద్య,ఉద్యోగ అవకాశాలపై అవగాహన పొందారని,అలాగే విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు 68 చోట్ల



వంటల పోటీలు మరియు ఆరోగ్య స్పృహ కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.పాఠశాలల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు,పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయడం అభినందనీయమని కొనియాడిన డీఈఓ, ఈ కార్యక్రమాల విజయవంతానికి సహకరించిన ఉపాధ్యాయులకు,సిబ్బందికి మరియు భాగస్వాములైన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్

## - శ్రీనివాస్ గౌడ్ కు ల్యాబ్ టెక్నీషియన్ల ఘన సత్కారం



పెద్దపల్లి,మే 14:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి జిల్లా టీఎన్జీవో ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ వీరగోని శ్రీనివాస్ గౌడ్ కు జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.గురువారం పెద్దపల్లి జిల్లా టి-హబ్ ఆవరణలో అసోసియేషన్ అధ్యక్షుడు ఊర కృష్ణ కుమార్,ప్రధాన కార్యదర్శి సిద్ధ మధు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొని ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడిగా బొంకూరి శంకర్ వరుసగా నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికై చారిత్రాత్మక విజయం సాధించారని,ఇది వారి ఉద్యోగ పోరాట పటిమకు నిదర్శనమని కొనియాడారు.అటువంటి బలమైన నాయకత్వంలో మా మార్గదర్శకులు శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం తమ అసోసియేషన్‌కు గర్వకారణమని వారు తెలిపారు.ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుండే శ్రీనివాస్ గౌడ్,ఈ పదవి ద్వారా ఉద్యోగుల సంక్షేమానికి మరింత కృషి చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

## -మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ

ఎండపల్లి, మే 14 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామ శివారులో తేదీ 13.05.2026 బుధవారం రోజున రాత్రి సమయం లో చర్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన మృతుడు ఎరవెల్లి పర్శరాం తండ్రి మల్లయ్య వయసు ( 43 ) సంవత్సరాలు కులం మాదిగ అను అతడు తన యొక్క టీఎస్ –



02– యు ఏ –1568 నెం గల కారును రోడ్డు పక్కన పార్క్ చేసి రోడ్డు దాటే క్రమం లో ఎదో గుర్తు తెలియని వాహనం టక్కరి ఇవ్వగ మృతునికి బలమైన రక్త గాయాలు అయి సంఘటన స్థలంలోనే మృతి చెందటం జరిగింది. మృతునికి ఒక కొడుకు, ఇద్దరు బిడ్డలు సంతానం కాగా మృతుని భార్య గత నాలుగు సంవత్సరాల క్రితం చనిపోయింది మృతుడు గత నాలుగు నెలల నుండి కరీంనగర్ లో ఉంటూ సోడ బండి నడిపిస్తూ జీవిస్తున్నాడని మృతుని తల్లి ఎరవెల్లి లింగవ్వ ఇచ్చిన దరఖాస్తు పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు.

# స్వార్థ రాజకీయాలు చేయడం మానుకోవాలి

**- పొంతన లేకుండా మాట్లాడడం ఎమ్మెల్యే సంజయ్ కే చెందుతుంది - సీబీఎస్సీ విద్యను విద్యార్థులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది**
**- ఎంపీ అరవింద్ పై అనవసరపు విమర్శలు చేస్తే ఊరుకోము - దమ్ముంటే పది ఎకరాల స్థలం వెంటనే కేటాయించాలి**
**- జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ డాక్టర్ భోగ శ్రావణి ఫైర్**

జగిత్యాల్ ప్రతినిధి, మే 14 (ప్రజాకలం) :

ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు చేయడం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మానుకోవాలి.. పొంతన లేకుండా మాట్లాడడం ఎమ్మెల్యే సంజయ్ కే చెందుతుంది.. సీబీఎస్సీ విద్యను విద్యార్థులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది.. ఎంపీ అరవింద్ పై అనవసరపు విమర్శలు చేస్తే ఊరుకోము.. దమ్ముంటే పది ఎకరాల స్థలం వెంటనే కేటాయించాలి.. అని జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ డాక్టర్ భోగ శ్రావణి ఫైర్ అయ్యారు. గత రెండు రోజుల క్రితం ఓ సమావేశంలో డాక్టర్ సంజయ్ కేంద్ర విద్యాలయాల ఏర్పాటు పైన చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. తాము నిజాలు చెప్పినప్పటికీ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పొంతన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. తాము దీక్ష చేస్తున్న విషయం గురించి మాట్లాడితే అది పక్కనపెట్టి తమను ఉద్దేశపూర్వకంగానే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు తాము వాస్తవాలు మాట్లాడితే అది పక్కనపెట్టి పొంతన లేకుండా మాట్లాడడం ఎమ్మెల్యే సంజయ్ కే చెందుతుందన్నారు. జగిత్యాలలో ఉన్న అటూ ఇటూ కానీ నాయకులు సైతం తాము చెప్పిన నిజాన్ని ఒప్పుకోవడం లేదని విమర్శించారు. వారి యొక్క స్వార్థ రాజకీయాల కోసమే, వారు భూములు, జాగలు మరింత పెంచుకోవడానికే దాదాపు ఒకటిన్నర సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాలకు స్థలం కేటాయించకుండా అడ్డుకుంటున్నారన్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న విద్యా సంస్థలకు మాత్రమే స్థలాలు ఇస్తామని, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే విద్యాసంస్థలకు స్థలం లేదని సాక్షాత్తు ఎమ్మెల్యే అనడం హాస్యస్పదంగా ఉందన్నారు. ప్రజలు నమ్మి ఓటేసినప్పుడు వారి కనీస అవసరాలు తీర్చే బాధ్యత ఎమ్మెల్యే పైన ఉంటుందని, దాన్ని గుర్తుంచుకొని నడుచుకోవాలని హితువు పలికారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కేంద్రాన్ని ఒప్పించి ఇక్కడ కేంద్ర విద్యాలయం ఏర్పాటు చేయడానికి మంజూరు తీసుకువస్తే అదేమి ఇక్కడ విద్యార్థులకు అవసరం లేనట్టు ఎమ్మెల్యే ప్రవర్తించడం సరికాదన్నారు. సీబీఎస్సీ విద్యను ఇక్కడ విద్యార్థులకు దూరం చేసే కుట్రను స్థానిక ఎమ్మెల్యే పన్నుతున్నట్లు తమకు అనుమానం ఉందన్నారు. ఇక్కడ పాఠశాల ఏర్పాటు జరిగితే ఎక్కడ కేంద్ర ప్రభుత్వానికి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కు, బీజేపీ నేతలకు మంచి పేరు వస్తుందోనని భయంతో ఇక్కడి ఎమ్మెల్యే ఉన్నారని పేర్కొన్నారు. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఇచ్చిన ప్రెస్ మీట్ చూస్తే అసలు ఇక్కడ కేంద్ర విద్యాలయం ఎందుకు మంజూర అయిందోనని బాధతో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే మంజూరు చేస్తున్న పాఠశాలలే మంచివని, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే పాఠశాలలు అసలు తమకు అక్కర్లేదన్నట్లుగా ఎమ్మెల్యే తీరు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కేంద్ర విద్యాలయ ఏర్పాటును అడ్డుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మరి రాతపూర్వకంగా తమ నియోజకవర్గానికి కేంద్ర విద్యాలయం అవసరం లేదని స్పష్టంగా రాసివ్వాలని సవాల్ విసిరారు. తమకు నియోజకవర్గ ప్రజలు, విద్యార్థుల సంక్షేమం ముఖ్యం కాబట్టే ఇక్కడ ఏర్పాటు చేస్తున్న కేంద్ర విద్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షకు దిగుతున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలని తమ తాపత్రయ పడుతుంటే దీని అడ్డుకోవడానికి ఎమ్మెల్యే ప్రయత్నిస్తుండడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాలకు 25 ఎకరాల అయినా సరే కేటాయించిన ఎమ్మెల్యే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాలకు మాత్రం 10 ఎకరాల స్థలం కేటాయించలేకపోతున్నారని విమర్శించారు. స్వార్థ రాజకీయాలకు పాల్పడుతూ కేవలం తన బినామీలను అడ్డుపెట్టుకొని వారి స్థలాల్లో మాత్రమే పాఠశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే ముందుంటారని, కేంద్ర విద్యాలయ ఏర్పాటుకు మాత్రం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. అంతేకాకుండా అసలు విషయాన్ని పక్కన పెట్టి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కు ఆయన తాతగారికే ఆస్తులు ఎక్కువగా ఉన్నాయని పేర్కొనడం డబ్బు మదమెక్కి మాట్లాడడమేనని అన్నారు. ఇక్కడ ఆస్తుల టాపిక్ అవసరమే లేదని, అయినా కూడా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఎమ్మెల్యే సంజయ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ రాజకీయాలకు రాకముందు రాజకీయాలకు



వచ్చిన తర్వాత తన ఆస్తులు వివరాలేంటో చూసుకుందామని సవాల్ విసిరారు. తాము విద్యార్థుల భవిష్యత్తు కోసం మాట్లాడుతుంటే దాన్ని తప్పు దోవ పట్టించడానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆస్తుల విషయాన్ని తెరపై తెచ్చారని విమర్శించారు. డబ్బు పిచ్చితోనే తమ ఎంపీ ధర్మపురి అరవింద్ పైన, ఇతర సీనియర్ నాయకులపై అనవసరపు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే సంజయ్ చిట్ట మొత్తం తమ వద్ద ఉందని, అది విప్పితే నియోజకవర్గంలో తలెత్తుకొని ఉండలేరని వివరించారు. చిట్టా విప్పాల అని సవాల్ విసిరారు. పదేళ్లుగా బీజేపీ పార్టీలో ఉన్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పై ఒక్క అవినీతి మచ్చా అయినా ఉందా అని, ఉంటే రుజువు చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కు తెలిపారు. ఎప్పుడూ కాంట్రాక్టర్ల వద్ద కమిషన్ల కొరకు కక్కుర్తి పడే ఆయన తమ ఎంపీపై మాట్లాడే అర్హత లేదన్నారు. అసలు నియోజకవర్గానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఏం చేశారని విమర్శలు చేసేముందు నియోజకవర్గానికి రూ. 60 కోట్లు, రాయికల్ మున్సిపల్కు రూ. 15 కోట్లు మంజూరు చేయించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సంజయ్ వందల కోట్ల కోసమే కదా పార్టీ మారింది..? ఇది గుర్తుంచుకోవాలన్నారు. హితువు పలికారు. వారికోసం సీనియర్ నాయకులనే వదులుకున్న వారి పార్టీ అధిష్టానం కేవలం 10 ఎకరాలు కేటాయించాలని లేదా అని ఎమ్మెల్యే సంజయ్ ను ప్రశ్నించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులు మంజూరు చేసిందో, ఎన్ని చేస్తుందో ఎమ్మెల్యే సంజయ్ గుర్తించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల నుండి అభివృద్ధి పనులు ప్రారంభించే సమయంలో ప్రోటోకాల్ ప్రకారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ను పిలవాల్సి ఉన్నప్పటికీ ఆయనను పిలవకుండానే పనులను ప్రారంభించడం ఎంతవరకు సమంజసం అని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమం చేయడం కేవలం ఎంపీ అరవింద్ కే దక్కుతుందన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే సంజయ్ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఎన్ని నిధులు మంజూరు చేయించారు.. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు మంజూరు చేయించారు తెలుసుకోవడానికి చర్చకు వస్తారని సవాల్ విసిరారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అనవసరకు విమర్శలు మానుకోవాలని, లేదంటే నియోజకవర్గం ఒకరోజు బుద్ధి చెప్పే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కాగా ఇప్పటికైనా 15 వరకూ ఎంపీ అర్వింద్ సమయం ఇచ్చారని, అయినా ఎమ్మెల్యే, మంత్రి, ప్రభుత్వం నుంచి చలనం లేదన్నారు. ఈ నెల 18న ధర్మపురి అర్వింద్ జగిత్యాల ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్మ దీక్ష పేరుతో దీక్ష చేపడుతారని, అందరు ధర్మస్థలికి పెద్దగా ఎత్తున సోమవారం 9 గంటలకు వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని కుట్రలు చేసిన ధర్మ దీక్ష ఆగదని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, అర్బన్ మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, మహిళ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పిండేరు భానుప్రియ, జిల్లా మహిళా మోర్చా నాయకురాలు దూరిశెట్టి మమత, ప్రధాన కార్యదర్శులు ఆముదరాజు, సిరికొండ రాజన్న, పూదరి శ్రీనివాస్, జిల్లా కార్యాలయ కార్యదర్శి జంబర్తి దివాకర్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ సుంచు సురేష్, సిరిపురం శ్రీనివాస్, పవన్ సింగ్, గదాసు రాజేందర్, ఇట్యాల రాము, మహిళా మోర్చా నాయకురాలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవసాయ అవసరాలకే చెరువు మట్టిని వినియోగించాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,మే14:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులలోని సారవంతమైన చెరువు మట్టిని తమ వ్యవసాయ భూములకు తరలించేందుకు ఆసక్తి గల రైతులు రేపటి నుంచి సంబంధిత తహసీల్దార్



కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.నీరు లేని చెరువుల నుంచి చెరువు మట్టిని వ్యవసాయ భూములకు తరలించుకోవడానికి అనుమతులు మంజూరు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.దరఖాస్తులో రైతు వివరాలు,భూమి విస్తీర్ణం,వీ వీ బీ వివరాలు,రవాణా వాహనం వివరాలు, వాహన నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు.సంబంధిత తహసీల్దార్ దరఖాస్తులను పరిశీలించి అనుమతులు జారీ చేస్తారని, అనంతరం రైతులు చెరువుల నుంచి చెరువు మట్టిని తరలించుకోవచ్చని కలెక్టర్ వివరించారు. రైతులకు ఈ సారవంతమైన చెరువు మట్టిని పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నామని,రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ చెరువు మట్టిని కేవలం వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని స్పష్టం చేశారు.చెరువు మట్టిని ఇతర అవసరాలకు మళ్లించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించి,కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం**

2026-27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్ లోని బేగంట్ పబ్లిక్ స్కూల్ లో 1వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశం కొరకు జిల్లాలోని ఎస్సీ విద్యార్థినీ,విద్యార్థులు మే 29లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ విద్యార్థిని,విద్యార్థులు 2019 జూన్ 1 నుండి 2020 మే 31 మధ్యలో జన్మించి ఉండాలని,తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రెండు లక్షలు,రూరల్ ప్రాంతంలో ఒక లక్షా 50 వేల లోపు ఉండాలని,ధృవీకరణ పత్రాలు ఆదాయం, కులం,బర్త్,స్టడీ సర్టిఫికెట్,1పాస్ పోర్ట్ సైజ్ ఫోటో జత చేసి పూర్తి చేసిన దరఖాస్తులను గెజిటెడ్ అధికారిచే అటేస్టడ్ చేసిన మే 29 సాయంత్రం 5 గంటల లోగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని,జూన్ 1న లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు ఉంటుందని, ఇతర వివరాలకు పెద్దపెల్లి కలెక్టరేట్ లోని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయం నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఎమ్మెల్యే.. కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీఓ జిల్లా నూతన కార్యవర్గం





పెద్దపల్లి,మే 14:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) టీఎన్జీఓ పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గం గురువారం జిల్లాలోని ప్రజాప్రతినిధులను, ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసింది.జిల్లాలోని అన్ని యూనిట్ల ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిసిన అనంతరం, నూతన బాధ్యతలు చేపట్టిన ప్రతినిధులు మర్యాదపూర్వక భేటీలు నిర్వహించారు. తొలుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావుని కార్యవర్గ సభ్యులు కలిశారు.వరుసగా నాలుగోసారి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొంకూరి శంకర్,నూతన కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి,పుష్పగుచ్ఛం మరియు ఫలాల బుట్టను అందజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ని కార్యవర్గ సభ్యులు కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ,ఉద్యోగుల పలు సమస్యలపై సానుకూలంగా స్పందించారు.బొంకూరి శంకర్ వరుస విజయాలను కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు.తదనంతరం జిల్లా పరిపాలన అధికారి బండి ప్రకాష్ ని కలిసి సన్మానించిన కార్యవర్గం,ఆయనకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసింది.ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు అనితతో పాటు సభ్యులు స్వప్న,సౌమ్య,శిల్ప,భాగ్యమ్మ,అమరేందర్ రెడ్డి,శ్రీనివాస్,రమేష్,మహేందర్ రెడ్డి,రాజశేఖర్,నిశాంత్,రాజిరెడ్డి, శివ,రామచంద్రం,ప్రచేతన్,ప్రేమ్ సాగర్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాప్యం చేయవద్దు

## - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ మే 14 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఆలస్యం చేయవద్దని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్



భవేశ్ మిశ్రా, గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్, మండలాల వారిగా అనుమతులు లభించిన ఇండ్లు, ప్రారంభించిన నిర్మాణాలు, అటవీ నిబంధనల వల్ల ఆగిన ఇండ్లు, తదితర అంశాలు సమీక్షించారు. తమ పరిధిలో ఉన్న అటవీ అంశాల పరిష్కారానికి అటవీ అధికారులు కృషి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తులు పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తులను పై దశకు పంపించాలని అన్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురవుతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి, ఇండ్ల నిర్మాణాలు వెంట వెంటనే పూర్తి చేసేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఖానాపూర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి రేవంత్ చంద్ర, హౌసింగ్, ఫారెస్ట్ అధికారులు, ఎంపీడీవో లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతాం

## బీసీ జేఏసీ జిల్లా చైర్ పర్సన్ దాసరి ఉష - జీవన్ రెడ్డిని కలిసిన దాసరి ఉష బృందం



పెద్దపల్లి,మే 14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,పార్టీ సభ్యత్వ ఇన్చార్జి జీవన్ రెడ్డిని పెద్దపల్లి బీసీ జేఏసీ చైర్మన్,బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష గురువారంమర్యాదపూర్వకంగా కలిశారు.ఈ భేటీలో ఆమెతో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,వివిధ సంఘాల నాయకులు పాల్గొని ఆయనకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ పార్టీ అభివృద్ధిలో జీవన్ రెడ్డి కృషి వెలకట్టలేనిదని,ఆయన నాయకత్వంలో క్షేత్రస్థాయిలో పార్టీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలోనూ,పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంలోనూ ఆయన అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటూ,రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.జీవన్ రెడ్డిని కలిసిన వారిలో బీఆర్ఎస్ సర్పంచులు మచ్చ అరుణ నాగరాజు,ఋషి సదాశివ రెడ్డి,గ్రామ అధ్యక్షులు రావుల స్వామి గౌడ్,దాడి ఐలయ్య,ఉప సర్పంచ్ లోనే సదయ్య,ఉపాధ్యక్షులు పిట్టల సది,యూత్ ప్రెసిడెంట్లు కలవేన మహేష్, కలవేన రాము,ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ ప్రెసిడెంట్ మచ్చ రాహుల్,స్వేరో జిల్లా ప్రెసిడెంట్ మల్లారపు మహేందర్,కామిడి సంధ్య వెంకట్ రెడ్డి,కామిడి రవీందర్ రెడ్డి, కాసర్ల హనుమంత రెడ్డి,వార్డు సభ్యులు శ్రవణ్,మీడియా ఇన్చార్జి అబ్దుల్ మాలిక్,మహేందర్,హరీష్,ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ నాయకులు ఉమాపతి,పవన్,అవినాష్, అక్షయ్,గణేష్, సంజయ్,రాహుల్,అశోక్,రమేష్,అజీమ్,సాగర్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి 'సై'.. భారీ విస్తరణకు 'నై'

## - రోడ్డు వెడల్పును 50 అడుగులకే పరిమితం చేయండి
## - మున్సిపల్ అధికారులకు వ్యాపారుల విన్నపం

పెద్దపల్లి,మే 14:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్డు వెడల్పు పనులు వేగవంతం కావడంతో స్థానిక వ్యాపారులలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో,గురువారం పట్టణ వ్యాపారులు పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని మున్సిపల్ చైర్మన్,కమిషనర్‌తో భేటీ అయ్యారు.తమ ఉపాధిని దెబ్బతీయకుండా రోడ్డు వెడల్పు ప్రక్రియను చేపట్టాలని వారు వారు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా వ్యాపార ప్రతినిధులు మాట్లాడుతూ పట్టణంలో ప్రతి వస్తువు దొరికే ఏకైక కేంద్రం మెయిన్ రోడ్ అని పేర్కొన్నారు.అధికారులు భావిస్తున్నట్లుగా రోడ్డును 60 నుండి 66 అడుగుల మేర వెడల్పు చేస్తే,సుమారు 70కి పైగా దుకాణాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.దీనివల్ల వ్యాపారస్తుల కుటుంబాలే కాకుండా,అక్కడ పనిచేసే వందలాది మంది నిరుద్యోగ కార్మికులు రోడ్డున పడతారని వారు వివరించారు.అభివృద్ధికి తాము ఎప్పుడూ వ్యతిరేకం కాదని స్పష్టం చేస్తూ,రోడ్డు వెడల్పును 50 అడుగులకు పరిమితం చేయాలని వారు ప్రతిపాదించారు.ప్రస్తుతం ఉన్న 18 అడుగుల రోడ్డును 50 అడుగులకు పెంచితే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని,ఆ



పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదా ఇతర పనులు చేపట్టినా తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు.అలాగే, రోడ్డుపై పార్కింగ్ సమస్య తలెత్తకుండా వాహనాలను క్రమబద్ధీకరించుకుంటామని, షాపుల ముందు సామాన్లు ఉంచబోమని అధికారులకు భరోసా ఇచ్చారు.మున్సిపాలిటీకి పన్నులు చెల్లించడంలో తాము ఎప్పుడూ ముందుంటామని, తమ గోడును ఆలకించి మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

ఈ విషయంలో స్పష్టత కోసం స్థానిక ఎమ్మెల్యేను కలిసి తమ విన్నపాన్ని అందజేయనున్నట్లు వ్యాపార సంఘాల నాయకులు వెల్లడించారు.

# విద్యా వారోత్సవాల లో భాగంగా బడిబాట కార్యక్రమం



ఎండపల్లి, మే 14 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండల కేంద్రంలో గురువారం రోజున ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లోని విద్యా వారోత్స వాల లో భాగంగా మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ ఆధ్వర్యం లో గ్రామసర్పంచ్ మారం సునీత-జలంధర్ రెడ్డి, ఎండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, గ్రామ పెద్దలతో బడిబాట ర్యాలీ నిర్వహించడం జరిగింది. జడ్పీహెచ్ఎస్ ఎండపల్లి లో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల లో 100% ఉత్తీర్ణత సాధించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ 500కి పైగా మార్కులు సాధించిన 5 గురు విద్యార్థులను అభి నందిస్తూ, వారి తల్లిదండ్రులను సన్మానించడం జరిగింది. 2025 - 26 విద్యా సంవత్సరంలో 6 నుండి 9 వ తరగతి వారికి గల విద్యార్థులు అత్యధిక హజరు శాతం, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బహుమతితో ప్రోత్సహించడం జరిగింది. రాష్ట్ర విద్యాశాఖ నుంచి నిర్ణీత కాలంలో అత్యధిక హాజరు శాతం కలిగిన ఉపాధ్యా యుల ను అభినందిస్తూ ప్రశంసా పత్రాలను పంపించటం జరిగింది. దీనిలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎండపల్లి లో పనిచేస్తున్న డి. రవీందర్, హిందీ స్కూల్ అసిస్టెంట్, సిహెచ్ సుమలత, స్కూల్ అసిస్టెంట్ గణితం ఉపాధ్యాయులను ప్రశంసాపత్రంతో అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామసర్పంచ్ మారం సునీత జలంధర్ రెడ్డి, విద్యాభిమానులు, పాఠశాల హితైషులు కె వెంకట్ రెడ్డి, నగేష్, మండల విద్యాధికారి, జి ప ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు సముద్రాల హరికృష్ణ, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు డి. రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగిందని మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ తెలిపారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

## - జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్ మే 14 ( ప్రజా కలం ప్రతినిధి)

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. జిల్లాలోని పలు రైస్ మిల్లులను, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం మల్లాపూర్ మండలం రాఘవపేట, ముత్యం పేట గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలాగే మొగిలి పేట గ్రామంలోని రైస్ మిల్, ముత్యం పేట, రాఘవ పేట గ్రామంలోని పూజ ఇండస్ట్రియల్ రైస్ మిల్లు, విష్ణు ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గన్ని సంచులు, టార్పలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వస్తున్న వరి ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా అన్‌లోడ్ చేసిన వెంటనే లారీలను త్వరితగతిన పంపించాలని మిల్లర్లను ఆదేశించారు. రైతులు, రవాణాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం దిగుమతి, నిల్వ, మిల్లింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు.మిల్లుల్లో ధాన్యం నిల్వలు, తేమ శాతం, మిల్లింగ్ సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిల్లర్లు హమాలీలను అందుబాటులో ఉంచుకొని వచ్చిన ధాన్యాన్ని దింపుకోవాలని అలాగే మిల్లర్లు, ట్రాన్స్పోర్టర్లు, అధికారులు సమన్వయం చేసుకొని కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో ఆర్డీవో నరసింహ రావు, సివిల్ సప్లైస్ డిఎం జితేంద్ర ప్రసాద్ , తహసీల్దార్ రామచందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి

## - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ మే 14 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, నిర్మల్ మునిసిపాలిటీకి సంబంధించి పలు అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో ప్రతిరోజు మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వాన కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. త్రాగునీరు నిల్వ ఉంచే నీటి ట్యాంకులను శుభ్రపరచాలని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా త్రాగునీరు అందించాలని వివరించారు. పట్టణంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని తెలిపారు. పెండింగ్ పన్నుల వసూలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పట్టణ ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలని చెప్పారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగితే వెంటనే స్పందించి, ఆ సమస్యలు తొలగించాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు, మక్కలు కొనుగోలు వేగవంతం చేయండి

## బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి డిమాండ్

పాలేరు మే 14(ప్రజా కలం న్యూస్ )



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలసి కింది రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగినది. కూసుమంచి మండలంలో ధాన్యం కొనుగోలు, మక్కలు కొనుగోలు సకాలంలో సరిగ్గా జరగక పోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోవడంతో పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గన్ని సంచుల కొరత, లారీల కొరత ముఖ్యంగా మిల్లర్లు 8 నుంచి 10 కేజీల వరకు తరుగు తీయటం వలన పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవటం వలన తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నారు. కావున తక్షణమే స్పందించి ధాన్యం, మక్కలు కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులను ఆదేశించి తరుగు లేకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని మిల్లర్ల ను ఆదేశించి, ఒకవేళ ఎవరూ ఐన నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుచున్నాము.( ముఖ్యంగా అరుణాచల శివ రాజేశ్వరపురం, పద్మావతి పైనం పల్లె , వెంకటేశ్వర ఆగ్రో సువర్ణపురం మిల్లర్లు మొదలగు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి) వినతి పత్రము ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్, బద్దం వెంకట్ రెడ్డి, మంద చంద్ర శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జీళ్లచెరువులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వ్యవసాయ డైరెక్టర్ గోపి ఐఏఎస్

## - రవాణా సమస్యలు 2-3 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ

పాలేరు మే 14( ప్రజా కలం న్యూస్ )కూసుమంచి మండలం పరిధిలోని గురువారం జీళ్లచెరువు గ్రామంలోని ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖ డైరెక్టర్ శ్రీ గోపి ఐఏఎస్ గురువారం జీళ్లచెరువు గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ రైతులతో కొనుగోలు ప్రక్రియ, పంటల నాణ్యత, ధరలు, రవాణా సమస్యల గురించి వివరంగా చర్చించారు. రైతులు ఎదుర్కొంటున్న రవాణా ఆలస్యాలు, పంటలు కొనుగోలు కేంద్రాలకు చేరే సమయం, డబ్బులు ఆగి ఉండటం వంటి సమస్యలను ఆయనలు గమనించారు. రైతులు తమ అభ్యంతరాలు, సూచనలు వివరించగా, డైరెక్టర్ గోపి ఐఏఎస్ మాట్లాడుతూ, "రవాణా సమస్యలు 2-3 రోజుల్లో పూర్తిగా అధిగమిస్తాము. ప్రభుత్వం రైతుల పంటలు త్వరగా కొనుగోలు చేసి, డబ్బులు ఖాతాల్లోకి జమ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటుంది. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ స్థిరంగా సాగుతోంది. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా చూస్తాము" అని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలో పంటల నమూనాలు పరిశీలించి, సిబ్బందితో కొనుగోలు ప్రక్రియలో మరింత స్పీడ్ పెంచాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్, మండల వ్యవసాయ అధికారి శ్రీమతి రామడుగు వాణి, పిఎసిసి చేగొమ్మ సెక్రటరీ రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు రవీందర్, జానీ, రవి కుమార్, సిబ్బంది, అలాగే గ్రామంలోని డజన్ల మంది రైతులు పాల్గొన్నారు. రైతులు డైరెక్టర్ సందర్శనపై సంతోషం వ్యక్తం చేస్తూ, త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో భారీ ఉత్తేజం నెలకొంది. ప్రభుత్వం నిర్ణయించిన మినిమం సపోర్ట్ ప్రైస్ (ఎంఎస్‌పీ) ప్రకారం పంటలు కొనుగోలు చేస్తున్నారు. రైతులు తమ పంటలు అమ్ముకోవడంతో పాటు, ఆదాయం పెరిగి ఆనందిస్తున్నారు.



## మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లోకి వలసలు

### - మునిగేపల్లి సర్పంచ్, ఐదుగురు వార్డు సభ్యుల చేరిక



పాలేరు మే 14(ప్రజా కలం న్యూస్ )

కూసుమంచి మండలంలో అధికార పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి. మునిగేపల్లి సర్పంచ్ గంగా స్రవంతి తన అనుచర వర్గంతో కలిసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మంలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐదు నెలల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందిన గంగా స్రవంతి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. సర్పంచ్‌తో పాటు ఆమె వెన్నంటి గెలిచిన ఐదుగురు వార్డు సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు మంత్రి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి జన్మదిన వేడుకలు



ఖమ్మం మే 14(ప్రజా కలం న్యూస్ ) ఖమ్మం గురువారం మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్ గా విద్యార్థి లోకాన్ని ఏకం చేసి తెలంగాణ రాష్ట్ర సాధనకు విశేష కృషి చేసిన విద్యార్థి ఉద్యమకారుడు , మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి జన్మదిన వేడుకలు ఖమ్మంలోని అంబేద్కర్ భవన్ లో జిల్లా విజయ్ కుమార్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వస్తే గురుమూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు వందలాది కేసులతో పాటు , జైలు జీవితం గడిపి ఉద్యమంలో తన సత్తా చాటిన యువ నాయకుడు పిడమర్తి రవి జన్మదిన జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు . కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా ఎంత ఉంటే అంత వాటా రావాలని రిజర్వేషన్ల పెంపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన పిడమర్తి రవి ధన్యజీవి అని కొనియాడారు . ఈ పుట్టినరోజు వేడుకలో ఆర్ పి ఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరీకంటి సంజీవరావు , మాగి శేషగిరి , తెలంగాణ ఉద్యమకారుడు కొరకొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు .

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కందాల




పాలేరు మే 14 (ప్రజాకలం న్యూస్) కూసుమంచి మండలం పరిధిలోని గురువారం బికారితండ గ్రామానికి చెందిన తేజావత్ జయంతి -భద్రమ్మల కుమారుడు రాజ్ కుమార్-అఖిల వెడ్డింగ్ రిసెప్షన్ బికారితండ గ్రామం లో జరిగినది ఇట్టి వేడుకు పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

( వరంగల్/ పర్వతగిరి) మే 14, ప్రజాకలం ప్రతినిధి

వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు చిరుత విజయ్ గారి తండ్రి చిరుత యాకయ్య ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకొని నేడు వారి నివాసానికి వెళ్లి యాకయ్య గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పర్వతగిరి మండలం గడ్డపార తండాకు చెందిన భూక్య బాలు నాయక్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా నేడు వారి నివాసానికి చేరుకుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ పరామర్శలో మాజీ మంత్రి గారితో సొసైటీ చైర్మన్ యం. మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, ఏయంసీ మాజీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి, ఏయంసీ మాజీ డైరెక్టర్ బోయినపెల్లి యుగేందర్ రావు, మాజీ సొసైటీ చైర్మన్ గంధం, సీనియర్ నాయకులు బొట్ల మధు, మసాని వెంకట్, భూక్యా రవి, ఎర్రబెల్లి కిషన్ రావు, వీరచారి, ముదురుకోళ్ల రాజు, దొమ్మటి రాజు, రంజిత్, చిన్నపాక శ్రీకాంత్, ఈరయ్య, గుగులోతు సుమన్, భూక్యా బాలు, భూక్యా వెంకన్న, భూక్యా వెంకటేష్, సోషల్ మీడియా చిన్నపెల్లి అజయ్ తదితరులు ఉన్నారు.



## విద్యా వారోత్సవాలలో భాగంగా పర్వతగిరి లో

# బడిబాట ర్యాలీ కార్యక్రమం

### - ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు దీటుగా మీ పిల్లల్ని తీర్చిదిద్దుతాం

### - సీనియర్ ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు

( వరంగల్/ పర్వతగిరి) మే 14, ప్రజాకలం ప్రతినిధి.

విద్యా వారోత్సవాల లో భాగంగా నిర్వహించిన బడిబాట కార్యక్రమం పురస్కరించుకొని, పర్వతగిరి, చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని జెడ్పీహెచ్ఎస్ పర్వతగిరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్ కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు పిల్లల చదువుల గురించి అనవసరమైన ఖర్చులు తగ్గించుకోవాలని వారిని తీర్చిదిద్దే బాధ్యత మేము తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సంవత్సరం నుండి ప్రభుత్వం 9 వస్తువులతో కూడిన ఉచిత కిట్ ప్రతి విద్యార్థికి అందిస్తుందని ఈ అవకాశాన్ని మండలంలోని తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. సీనియర్ ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను



ప్రైవేటు పాఠశాల లో చదివే విద్యార్థులకు దీటుగా తయారు చేస్తామని అన్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా మాట్లాడుతూ తల్లితండ్రులు లేని అమ్మాయిలను కస్తూర్బా గాంధీ విద్యా నిలయం పర్వతగిరి లో చేర్పించాలని కోరారు. ఇంటర్లో కూడా అమ్మాయిలకు అడ్మిషన్లు ఉన్నాయని తెలిపా రు. ఈ బడిబాట కార్యక్రమంలో ఇరు పాఠశాలల ఉపాధ్యా యుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి వినతి పత్రం అందజేత

### - జీవో నెంబర్ 17 ను వెంటనే రద్దు చేయాలి

### - కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మంద శ్యామ్

మే 14, ప్రజాకలం ప్రతినిధి, వరంగల్

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మంద శ్యామ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కాంట్రాక్టులో మాపై జరుగుతున్న అన్యాయాలపై సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ మంత్రి కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో బడా కాంట్రాక్టులకే అవకాశం కల్పిస్తూ బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ కాంట్రాక్టులకు అన్యాయం చేస్తున్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ చిన్న చిన్న కాంట్రాక్టర్లకు సమన్వయ న్యాయంతో దాదాపు 15 - 20 వేల మందికి ఉపాధి అవకాశం కల్పించారు. కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల, కామారెడ్డి, డిక్లరేషన్ కు విరుద్ధంగా చేస్తూ మా నోటికాడి బుక్క లాక్కొని మమ్మల్ని అడ్డ కూలీలుగా చేసే ప్రయత్నం చేస్తుంది.

**డిమాండ్స్**... జీవో నెం 17 వెంటనే రద్దు చేయాలి. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు న్యాయమైన వాటా కల్పించాలి. చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్లను అమలు చేయాలి. జనాభా ప్రాతిపదికన కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి. తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టులను తెలంగాణకు చెందిన కాంట్రాక్టర్లకి ఇవ్వాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కుటీర పరిశ్రమలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కాంట్రాక్టర్లకు ఈఎండి, సెక్యూరిటీ



డిపాజిట్ నుండి మినహాయింపు ఇవ్వాలి. టెండర్ నిబంధనలను సులభతరం చేసి చిన్న కాంట్రాక్టర్లు కూడా పాల్గొనేలా చేయాలి. ప్రీ-బిడ్డింగ్ మీటింగ్స్కు ఎంట్రీ ఫీజులను రద్దు చేయాలి.స్థానిక కాంట్రాక్టర్లకుప్రాధాన్యం ఇచ్చే నిబంధనలు రూపొందించాలి. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో పారదర్శకత మరియు సమాన అవకాశాలు కల్పించాలి.బీసీ- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కోఆపరేటివ్ సంస్థల ద్వారా కాంట్రాక్టులు ఇవ్వాలి. పై డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని బిసి ఎస్సీ ఎస్టీ, మైనార్టీలకు న్యాయం చేయాలని కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మందషాన్ డిమాండ్ చేయడం జరిగింది.

## సోషల్ మీడియాలో విజయ్ రికార్డ్

చెన్నై : రాజకీయంగా ఎలా ఉన్నా సరే.. తమిళనాడు విజయ్ కి సోషల్ మీడియాలో మాత్రం విపరీతమైన ముఖ్యమంత్రి పాపులారిటీ ఉంటుంది.అతనికి బలమైన అభిమానులు ఉన్నారు.అతడు రాజకీయాలకు రాకముందే ఒక అభిమాన సంఘాన్ని ఏర్పాటు చేశాడు.దానిద్వారా సేవ కార్యక్రమాలు నిర్వహించారు.ఆ తర్వాత ఆ అభిమాన సంఘం పేరుతో విజయ్ తండ్రి రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తే ఒప్పుకోలేదు. చివరికి తన తండ్రి మీదనే విజయ్ పోలీస్ కేసు పెట్టాడు. ఆ తర్వాత కొద్ది రోజులపాటు విజయ్, ఆయన తండ్రి మాట్లాడుకోలేదు. ఆ సమయంలో విజయ్ తల్లి మధ్యవర్తి పాత్ర పోషించారుతమిళనాడు ముఖ్యమంత్రిగా స్వీకారం చేసిన తర్వాత విజయ్ గురించి స్థానిక మీడియా మాత్రమే కాదు నేషనల్ మీడియా కూడా విపరీతంగా ప్రయత్నిస్తోంది. ఇటీవల విజయ్ ప్రమాణ స్వీకారానికి సంబంధించిన లైవ్ ను దేశంలో ఉన్న అన్ని జాతీయ మీడియా సంస్థలు టెలికాస్ట్ చేశాయి. ఆ టెలికాస్ట్ సోషల్ మీడియాలో సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేసింది. విపరీతమైన వ్యూస్ లభించడంతో విజయ్ నేషనల్ సెలబ్రిటీ అయిపోయాడు. రాజకీయాలలో ఎటువంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయబడలేదు. ఇటీవల విజయ్ ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ. ఆ సమయంలో వారిద్దరు ఒకరిని ఒకరు బ్రదర్ అంటూ సంభోదించారు.విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయనకు సంబంధించిన డైలీ అప్‌డేట్‌లు తెలుసుకోవడానికి అభిమానులు విపరీతమైన ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ చెల్లింపు తమిళనాడు సీఎంఓ పేజీకి గతంలో 4.4 లక్షల మంది ఫాలోవర్లు మాత్రమే ఉండేవారు.



సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 48 గంటల్లోనే ఆ పేజీ రికార్డు స్థాయిలో ఫాలోవర్లు పెరిగాయి. ఇప్పుడు ఆ సంఖ్య అంతకుమించి అనే స్థాయికి చేరుకుంది. దాదాపు పది లక్షల మంది కొత్త యూజర్లు యాడ్ అయ్యారు.ఎక్స్ పేజీకి మిలియన్ యూజర్లు యాడ్ అయ్యారు. దీనితో ఆ సంఖ్య రెండు మిలియన్లను దాటేసింది.విజయ్ కి ఉన్న అపారమైన అభిమాన గణానికి ఇది ఒక నిదర్శనం అని రాజకీయ విశ్లేషకులు చూస్తున్నారు.విజయ్ ప్రమాణ స్వీకార సమయంలో మాట్లాడిన మాటలు చాలా హుందాగా ఉన్నాయి.తమిళ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉన్నాయి.ప్రతి సందర్భంలోనూ తమిళనాడు ముఖ్యమంత్రి అనే అహాన్ని విజయ్ చూపించలేదు. ప్రభుత్వం ఎలా పనిచేస్తుంది.. ఎలా పని చేస్తుందనే విషయాలపై స్పష్టత ఇచ్చారు. విజయ్ తమిళనాడు రాజకీయాలలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నానంటూ ప్రజలకు సంకేతాలు ఇచ్చారు

## బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఫెన్సింగ్ ఏర్పాటు

కోల్ కత్తా : బెంగాల్ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బిజెపి ఏం చేస్తుందనే ప్రశ్నకు తొలి సమాధానం చెప్పేశాడు బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి. తన రాజకీయ గురువు మమతా బెనర్జీకి ఇప్పటికే షాక్ ల మీద షాక్ లు ఇచ్చిన సువేందు అధికారి.. తాజాగా మరో మాస్టర్ స్ట్రోక్ ఇచ్చేసాడు.ఇప్పటికే ఎమ్మెల్యేగా ఓడిపోయి మమత దీనంగా ఇంట్లో కూర్చుని ఉన్నారు. భవిష్యత్తును తలుచుకుంటూ భయభయంగా గడుపుతున్నారు. ఇప్పటికే చాలామంది టీఎంసీ నేతలు బిజెపిలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు. కాకపోతే అధిష్టానం నుంచి ఇంతవరకు గ్రీన్ సిగ్నల్ రాలేదు. 15 సంవత్సరాలపాటు అధికారంలో ఉన్న టీఎంసీ.. కార్యకర్తలను కాపాడుకోవడం ఇకపై కష్టమేమో. ఎందుకంటే అధికారాన్ని కోల్పోయిన మరుక్షణమే టీఎంసీ నేతలు కండువాను మార్చడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే బిజెపి అంత ఈజీగా వారిని పార్టీలోకి తీసుకొని అవకాశం కనిపించడం లేదు.వెస్ట్ బెంగాల్లో తొలిసారి గవర్నమెంట్ ని ఏర్పాటు చేసిన బిజెపి.. తన మార్క్ ను చూపించేందుకు సిద్ధమవుతోంది. తొలి క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి సువేందు అధికారి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో ప్రధానమైనది బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం.. దీనికి సంబంధించి భారత సెక్యూరిటీ ఫోర్స్ కు అవసరమైన భూమిని బదిలీ చేయడానికి బెంగాల్ ప్రభుత్వం ఓకే చెప్పింది.. సరిహద్దుల్లో భద్రత.. బంగ్లాదేశ్ ప్రాంతం నుంచి చొరబాట్లను అడ్డుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. భూమి బదిలీ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన మొదలు పెడుతున్నారు. 45 రోజుల్లోనే ఇది పూర్తి చేస్తారు.

## చింత నెక్కొండలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసిన గ్రామ సర్పంచ్




( వరంగల్/ పర్వతగిరి ) మే 14, ప్రజాకలం ప్రతినిధి

పర్వతగిరి మండలం చింత నెక్కొండలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుసుకొని గ్రామ సర్పంచ్ గాడుదుల రమేష్ యాదవ్, ఉప సర్పంచ్ పేరాల కవిత-దేవేందర్రావు, ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. హాస్పటల్లోని సదుపాయాల గురించి మాట్లాడుతూ, ఉపకేంద్ర వైద్యురాలు నవ్య కృష్ణను, ఆశ వర్కర్లను సమయపాలన పాటించి హాస్పటల్ ను సాయంత్రం వరకు తెరిచి ఉంచాలని అన్నారు. అలాగే చికిత్స కోసం వచ్చిన గ్రామ ప్రజలకు తగు వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రాథమిక ఉప కేంద్రంలో సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని వారు అన్నారు. ఈ హాస్పిటల్ తనికి లో సర్పంచ్, ఉప సర్పంచ్ లతో పాటు గ్రామ ప్రజా ప్రతినిధులు చలపతిరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జనగణన సర్వేలో ఖచ్చితత్వం పాటించాలి

### - ఇంటింటి సర్వేను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ ఇ. జోనా

మే 14 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న భారత జనగణన – 2027 ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఇ. జోనా గురువారం పరిశీలించారు. సర్వే నిర్వ హిస్తున్న ఎన్యూమరేటర్ల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిని తప్పనిసరిగా సర్వే చేసి సంబంధిత వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు, జనాభా గణాంకాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని నిబంధనలకు అనుగుణంగా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లకు ఆదేశించారు.





సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ప్రత్యేక నంబర్ కేటాయించాలని తెలిపారు.జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వం రూపొందించే అభివృద్ధి ప్రణాళికలకు ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు కూడా సరైన సమాచారాన్ని అందించి జనగణన కార్యక్రమానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యం

### - వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాల

### -పేరెంట్స్-టీచర్స్ సమావేశం, వైద్య శిబిరం నిర్వహణ




మే 14 ప్రజాకలం ప్రతినిది:(వరంగల్ /వర్ధన్నపేట) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. పోశయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌తో పాటు ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భరత్ విద్యార్థులు, గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు కూడా నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధి, హాజరు, ఆరోగ్య పరిస్థితులపై తల్లిదండ్రులతో అధ్యాపకులు చర్చించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. పోశయ్య సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజు, డాక్టర్ జి. రజిత, హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. సంధ్య, డాక్టర్ పి. సుధారాణి, డాక్టర్ బి. విష్ణుకుమార్ రెడ్డి, డాక్టర్ ఎన్. శ్రీనివాస్, డాక్టర్ సీహెచ్ స్నేహలతా రెడ్డి, డాక్టర్ సంపత్ రెడ్డి, డాక్టర్ పి. శ్వేత, కె. జోష్నతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## వీధి విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలి

### – ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం

సత్తెనపల్లి : పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని వీధి విక్రయదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్, ఏఐటీయూసీ నాయకులు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. ఆనంద్ కుమార్ కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సత్తెనపల్లి ఇంచార్జి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు అనుగుణంగా వీధి విక్రయదారులకు రుణాలు, గుర్తింపు కార్డులు, వ్యాపార స్థలాలు, సంక్షేమ పథకాలు వంటి సహాయ సహకారాలు అందించాలని కోరారు. పట్టణాల్లో నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక మంది చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబం పోషిస్తున్నారని తెలిపారు. అయితే వీధి విక్రయదారులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వ్యాపార స్థలాల సమస్య, రుణ సదుపాయాల లోపం, వర్షాకాలంలో రక్షణ లేకపోవడం, పారిశుద్ధ్య సమస్యలు వంటి అంశాలు వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.

## ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ఉపశమనం కల్పిస్తూ

### -సిపి ప్రత్యేక సహాయం

సిద్దిపేట:14 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

తీవ్ర వేసవి ఎండల్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ఉపశమనం కల్పిస్తూ పోలీస్ కమిషనర్ ప్రత్యేక సహాయక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బందితో ప్రత్యక్షంగా మాట్లాడిన



కమిషనర్,వారి సమస్యలు, ఫిర్యాదులను తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమం మరియు విధుల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా వేసవి కాలంలో ట్రాఫిక్ సిబ్బందికి తగినంత తాగునీరు, హైడ్రేషన్ సదుపాయాలు కల్పించాలని ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతతో పాటు నగరంలో సాఫీ ట్రాఫిక్ నిర్వహణ కోసం ట్రాఫిక్ పోలీసులు కష్టపడి పనిచేస్తున్న తీరును కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కుషాల్కర్, ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా, ట్రాఫిక్ ఏసీపీ సుమన్, సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమానస్పద స్థితిలో మహిళా మృతి

గజ్వేల్ నియోజకవర్గం:14 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

వివాహిత జ్యోతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మునిగడప గ్రామంలో చోటుచేసుకుంది.



మునిగడప గ్రామానికి చెందిన తిరుపతి (60) మొదటి భార్య చనిపోవడంతో రెండవ వివాహం చేసుకున్నాడు రెండవ భార్య కూడా చనిపోవడంతో కొనాయిపల్లి గ్రామానికి చెందిన జ్యోతితో మొబైల్ ఫోన్లో పరిచయం అవ్వగా ఆ పరిచయం ప్రేమగా మారి జ్యోతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. జ్యోతికి మాయమాటలు చెప్పి వివాహం చేసుకున్నాడని జ్యోతి బంధువులు ఆరోపిస్తున్నారు. తిరుపతి జ్యోతి లకు ఒక కుమారుడు ఉన్నాడు. తిరుపతి తల్లిదండ్రులు తిరుపతి తో కలిసి జ్యోతిని చంపేసారని జ్యోతి బంధువులు ఆరోపిస్తున్నారు. ఇరువర్గాలు గజ్వేల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా దాడులకు పాల్పడగా ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. జ్యోతి భర్త తిరుపతిని పోలీసులు అదుపులోకి తీసుకొని గజ్వేల్ పోలీస్ స్టేషన్ లోనికి తీసుకువెళ్లారు. పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జ్యోతి భర్తను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## నియోజకవర్గం లో పలు రైస్ మిల్లులను అకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె.హైమావతి

సిద్దిపేట 14 మే 2026 ( ప్రజా కలం ప్రతినిది

గజ్వేల్ నియోజకవర్గంలోని గురువారం రాత్రి వేళల్లో కొండపాక మండలం లోని దుద్దేడ గ్రామంలో గల సురభి,అన్నపూర్ణ, వీరాంజనేయ మిల్లులలో వరి ధాన్యం దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దిగుమతిలో జాప్యం కాకుండా షిఫ్ట్ లా వారిగా పని చేసేందుకు ఎక్కువ సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని మిల్లర్ యజమానులను ఆదేశించారు. దిగుమతి కాగానే వెంటనే ట్రక్ షిట్ జెనరేట్ చేసి, మిల్లర్ అక్నాలజ్మెంట్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.



# పోలవరం పై అభ్యంతరాలు



కరీంనగర్ : పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఫేజ్-2 పనులను పునః ప్రారంభించే ప్రయత్నాలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫేజ్-2 కింద 45.72 మిటర్ల ఎఫ్ఆర్ఎల్ స్థాయిలో నీటి నిల్వ చేయడానికి ముందు, తెలంగాణలో కలిగే ముంపు, డ్రెయి నేజీ సమస్యలు, బ్యాక్‌వాటర్ ప్రభావంపై పూర్తి స్థాయి సంయుక్త సర్వే చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ ఇరిగేషన్ శాఖ ఇంజనీర్- ఇన్- చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) సీఈఓకు లేఖ రాశారు. ఇప్పటికే సుప్రీంకోర్టులో తెలంగాణ దాఖలు చేసి న ఒరిజినల్ సూట్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పి టిషన్ల నేపథ్యంలో కేంద్ర జల సంఘం చైర్మన్ ఆ ధ్వర్యంలో జరిగిన నాలుగు సాంకేతిక సమావేశా ల్లో సంయుక్త సర్వేకు అంగీకారం కుదిరిందన్నారు. భద్రాచలం పట్టణం, మణుగూరు హెవీ వాట ర్ ప్లాంట్, కిన్నెరసాని, ముర్రేడు వాగుల పరిసర ప్రాంతాల్లో ముంపు ప్రభావాలను అంచనా వే యాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్ట్‌ను రెండు దశ ల్లో అమలు చేస్తున్నట్లు 2025 ఏప్రిల్ 8న జరిగి న ప్రత్యేక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అధికారులు వెల్లడించిన విషయాన్ని గుర్తు చేసింది. మొ దటి దశలో 41.15 మిటర్ల వరకు, రెండోదశలో 4 5.72 మిటర్ల వరకు నిల్వ చేపడతామని అ ప్పట్లో తెలిపారని, రెండోదశ పనులు చేపట్టే ముందు రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని పే ర్కొంది. ఇదే సమయంలో పోలవరం లిఫ్ట్ స్కీ మ్ పనులను ఏపీ ప్రభుత్వం పునః ప్రారంభించేందుకు ఆదేశాలు ఇచ్చినట్లు మీడియాలో వస్తు న్న వార్తలపై తెలంగాణ సర్కార్ ఆందోళన వ్యక్తం చే సింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, సీడబ్ల్యూసీ, పీపీ ఏ అనుమతి లేకుండానే లిఫ్ట్ స్కీమ్ పనులు చేపడుతున్నారని తెలంగాణ సర్కార్ ఆరోపించింది. ఇప్పటికే 2021--22లో ఈ పనులను నిలిపివేయాలని కేంద్ర సంస్థలు ఆదేశించాయని గుర్తు చేసింది. ముంపు ప్రాంతాలపై పూర్తి స్థాయి సర్వే పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా భద్రాచలం సహా ప్రభావిత ప్రాంతాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 36 వాగుల డ్రైనేజ్ ప్రభావంపై అధ్యయనం చేయాలని తెలంగాణ డిమాండ్ చేసింది. పోలవరం లిఫ్ట్ స్కీమ్ పునఃప్రారంభంపై తెలంగాణ ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఏపీ పనులు చేస్తోందని ఆరోపించింది. పోలవరం లిఫ్ట్ స్కీమ్ వెంటనే ఆపాలని తెలంగాణ కోరింది. ఏపీ పనులను నియంత్రించాలని పీపీఏకి తెలంగాణ విజ్ఞప్తి చేసింది. పోలవరం ప్రాజెక్ట్ సమగ్ర సాంకేతిక, ఆర్థిక, అంతర్రాష్ట్ర అంశాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించారని, లిఫ్ట్ స్కీమ్ వంటి మా ర్పులు ఇతర అంశాలపై ప్రభావం చూపుతాయని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కూడా అప్పట్లో ఏపీ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు పేర్కొం దిపోలవరం లిఫ్ట్ స్కీమ్ పనులను వెంటనే నిలిపివేసి, ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలను కూడా సమీక్షించాలని పీపీఏను కోరింది. ఈ అంశాన్ని కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ ఇరిగేషన్ శాఖ ప్రభుత్వాన్నికోరగా, గోదా వ రి నది నిర్వహణ బోర్డు(జీఆర్ఎంబీ) కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# నేపాలి కల్పన మామూలు లేడీ కాదు..

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ ప్రాంతంలో ప్రశాసన్ నగర్ అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. ఇంతటి భద్రత ఉండే ప్రాంతంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ (60) ఇటీవల ప్రాణాలు కోల్పోయారు. ఆమెను దారుణంగా అంతం చేశారు. ఈ ఘటనలో నిందితుల కోసం పోలీసులు విపరీతంగా శ్రమిస్తున్నారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాన్ని పోలీసులు ఇప్పటికే ఒక అంచనాకొచ్చారు. ఆమె అత్యంత కఠినమైన పరిస్థితుల్లో ప్రాణం కోల్పోయారని పోలీసులు పేర్కొన్నారు. పోస్ట్ మార్టం నివేదికలో కూడా ఇదే తేలింది. ప్రశాసన్ నగర్ లో భద్రత చాలా కట్టు దిట్టంగా ఉంటుంది. పోలీసులు కూడా నిత్యం గస్తీ కాస్తూనే ఉంటారు. అయినప్పటికీ ఈ ఘటన ఎందుకు జరిగిందనేది అర్థం కావడం లేదు. ఈ ఘటన జరిగిన తర్వాత పోలీసులు దాదాపు 200కు పైగా సిసి టీవీల కేమెరాల ఫుటేజీ పరిశీలించారు. అంతేకాదు కొంతమంది పోలీసులు శుక్రవారం సాయంత్రం నేపాల్ వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్పన, మరో ఇద్దరు జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆటోలో ఎక్కారని.. వారు నాంపల్లి ప్రాంతంలో దిగినట్టు ఆధారాలు లభించాయి.. వారు నాగ్ పూర్ ప్రాంతానికి వెళ్లి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ప్రాంతానికి వెళ్లడానికి వారు తెలంగాణ ఎక్స్ ప్రెస్ ఎక్కినట్టు తెలుస్తోంది. వి నేపథ్యంలో పోలీసులు ముందుగానే అక్కడికి వెళ్లారు. రైలు భోగిలలో విస్తృతంగా తనిఖీలు చేశారు. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. పోలీసులను తప్పు దోవ పట్టించేందుకు ఈ ఘటనకు పాల్పడిన వారు మధ్యలోనే దిగి ఉంటారని తెలుస్తోంది. కల్పన నేపాల్ దేశానికి చెందిన యువతి. ఈమెకు డబ్బు పిచ్చి చాలా ఎక్కువ. పైగా విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో డబ్బు బాగా ఉంటుందని ఒక అంచనాకొచ్చింది. పైగా ఈమె వెనుక ఒక ముఠా కూడా ఉంది. కొద్దిరోజుల క్రితం విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ ఇంట్లో పని మనుషులు కావాలని తెలిసింది. దీంతో ఆ ముఠా మనుషులు రంగంలోకి దిగారు. విశ్రాంత ఐపీఎస్ అధికారితో మాట్లాడారు. కల్పన మీ ఇంట్లో పని చేసేందుకు వస్తుందని చెప్పారు. దానికి ఆయన ఒప్పుకున్నారు. అప్పటినుంచి కల్పన వినయ్ ఇంట్లో పని చేస్తోంది. వినయ్ ఈమెను ఇంట్లో మనిషి లాగా నమ్మారు. పైగా ఆయన భార్యకు ఆరోగ్యం అంతంత మాత్రమే. పిల్లలు వేరే ప్రాంతాలలో స్థిరపడ్డారు.. ఇటీవల వినయ్ ఆరోగ్యం సరిగా లేకపోతే బెంగళూరు వెళ్లారు. దానికంటే ముందు కల్పన ఇంట్లో మనిషిలాగా మెదిలిపోయింది. వినయ్ డబ్బులు పెట్టేది.. బంగారం దాచేది



చూసింది. వినయ్ బెంగళూరు వెళ్ళిపోగానే ఆ ముఠా సభ్యులు ప్రణాళికను కల్పన చెప్పారు. కల్పన వారు చెప్పినట్టుగానే రంగంలోకి దిగింది. కొంతమంది వ్యక్తులతో కలిసి వినయ్ భార్యను అంతం చేసింది. ఇంతటి దారుణానికి పాల్పడేందుకు ప్రధాన కారణం డబ్బు, బంగారమే.. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు చాలా వరకు ఆధారాలు సేకరించారు. త్వరలోనే కల్పన, ఆమె వెనుక ఉన్న ముఠా సభ్యులను పట్టుకుంటామని చెబుతున్నారు. కల్పనతో అత్యంత చనువుగా ఉన్న మహిళలను పోలీసులు విచారించారు.. వినయ్ కి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చికిత్స కోసం బెంగళూరు వెళ్లారు. ఆయన వెళ్లిన తర్వాత కల్పన ఈ దారుణానికి పాల్పడింది. దానికంటే ముందు ఫోన్లో ఎక్కువసేపు మాట్లాడింది. సిసి కెమెరాలు మొత్తం రికార్డు అయ్యాయి. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో పోలీసులకు ఒక ఫోన్ లభించింది. అందులో ఉన్న నంబర్ల ఆధారంగా పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. ఈ దారుణానికి పాల్పడింది ముగ్గురా లేదా నలుగురా అనేది తెలసి ఉంది. కల్పన మామూలు లేడీ కాదని.. ముందుగానే ఒక పథకం ప్రకారం ఇంట్లో పనిమనిషిగా చేరిందని.. ఆ తర్వాత మొత్తం దోచుకుని పోయిందని పోలీసులు చెబుతున్నారు. అయితే ఆమెకు ఈ ఆదేశాలు మొత్తం బయట నుంచి వచ్చాయని.. ఆమె వెనుక ఉన్న ఆ వ్యక్తులు ఎవరో త్వరలోనే బయట పెడతామని తెలంగాణ పోలీసులు చెబుతున్నారు.

# అడుగంటుతున్న భూగర్భజలాలు

### జిల్లాలో 76 గ్రామాలు డార్క్ జోన్‌లోకి - అత్యధికంగా రణస్థలం మండలంలోనే - కొత్తబోర్లు, ఇసుక తవ్వకాలపై నిషేధం

శ్రీకాకుళం : ఒకప్పుడు పచ్చని పొలాలతో, సమృద్ధిగా నీటి వనరులతో కళకళలాడిన జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పుడు పాతాళగంగ అడుగంటిపోతోంది. దశాబ్దాలుగా భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేయడంతో పరిస్థితి ప్రమాదకస్థాయికి చేరుకుంది. ఈ విపత్కర పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కఠినచర్యలకు ఉపక్రమించింది. వాల్టా(ఆంధ్రప్రదేశ్ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్-2002) చట్టాన్ని ప్రయోగించి, రాష్ట్రవ్యాప్తంగా ఏడు జిల్లాల్లోని 258 గ్రామాలను 'ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్' (భూగర్భ జలాలను అత్యధికంగా తోడేసిన) ప్రాంతాలుగా ప్రకటించింది. ఇందులో జిల్లాలోని 76 గ్రామాలు డార్క్‌జోన్‌లో ఆందోళన కలిగిస్తోంది. స్టేట్ లెవల్ కమిటీ (ఎస్ఎల్‌సీ), సెంట్రల్ లెవల్ ఎక్స్‌పర్ట్ గ్రూప్ (సీఎల్ఈజీ) క్షేత్రస్థాయిలో జరిపిన శాస్త్రీయ అధ్యయనాలు, నివేదికల ఆధారంగానే ప్రభుత్వం ఈ గ్రామాలను గుర్తించింది. ఆయా గ్రామాల్లో కొత్తబోర్లు, ఇసుక తవ్వకాలను నిషేధిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. వాల్టా చట్టం సెక్షన్ 11(3) ప్రకారం ఈ గ్రామాల్లో ఇకపై కొత్తగా బోర్లు, బావులు తవ్వడం చట్టరీత్యా నేరం. ప్రజల, ప్రైవేట్ తాగునీటి అవసరాలకు ఉపయోగించే బావులు, చేతిపంపులకు మాత్రమే ఇందులో మినహాయింపు ఉంటుంది. వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాల కోసం ఇకపై చుక్కనీరు తోడాలన్నా అనుమతులు లభించవు. నీటి వనరులను కాపాడే ఉద్దేశంతో, వాల్టా చట్టంలోని సెక్షన్ 27 కింద ఈ గ్రామాల్లో ఇసుక తవ్వకాలను సైతం ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది.

**'రణస్థలం'లోనే అత్యధికంగా**

పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా కీలకమైన రణస్థలం మండలంలో భూగర్భజలాల దోపిడీ తీవ్రంగా జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో గుర్తించిన 76 గ్రామాల్లో సగానికిపైగా ఈ మండలంలోనే ఉండటం గమనార్హం. దీని తర్వాత స్థానాల్లో లావేరు, జి.సిగడాం, పొందూరు మండలాలు నిలిచాయి.

రణస్థలం మండలంలో 46 గ్రామాల్లో ఆంక్షలు అమలుకానున్నాయి. అక్కాయపాలెం, అర్జునవలస, బంటుపల్లె, బోయపాలెం, చిల్లపేటరాజం, చిట్టివలస, దేరసం, గిరివానిపాలెం, గోసం, జగన్నాథరాజపురం, జీరుకొవ్వాడ, కొండములగం, కోష్ట, కోటపాలెం, కొట్పెర్ల, కృష్ణాపురం, మహంతిపాలెం, మరువాడ, మెంటాడ, ముక్తంపురం, నరసింహ గోపాలపురం, నారువ, నెలివాడ, పాపారావుపేట, పాతర్లపల్లె, పాతసుంద్రపాలెం, పిశిని, పైడిభీమవరం, రామచంద్రపురం, రణస్థలం, రావాడ, సంచాం, సీతంవలస, సీతారాంపురం, సూరంపేట, సూరాపుం, టెక్కలి, తెప్పలవలస, తిరుపతిపాలెం, ఉప్పివలస, వలలభరావుపేట, వరాహనరసింహపురం, వరిసం, వేల్పురయి, వెంకటరావుపేట, ఎర్రవరం గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయాయి.

లావేరు మండలం(18 గ్రామాలు): అదపాక, అప్పాపురం, భరణికం, బుడతవలస, గోవిందపురం, గూడెంగొలుగుల వలస, గుమడాం, కేశవరాయపురం, కేవశరాయునిపాలెం, కొండకుంకాం, కొత్తకుంకాం, లావేరు, నాగంపాలెం, నీలాపురం, పెద్దలింగాల వలస, పోతయ్యవలస, తంవాడ, వెంటకాపురం గ్రామాలు.

జి.సిగడాం మండలం(6 గ్రామాలు): దళెంరాజువలస, దేవరవలస, నాయుడువలస, పున్నాం, సర్వేశ్వరపురం, ఉల్లివలస గ్రామాలు.

పొందూరు మండలం(6 గ్రామాలు) : బాణం, భగవాన్‌దాసుపేట, కేశవదాసుపురం, లోలుగు, నరసాపురం, పుల్లాజీపేట గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటినట్టు ప్రభుత్వ నివేదికలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో భూగర్భ జల, రెవెన్యూ శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈ గ్రామాల్లో నిబంధనల అమలుపై ప్రత్యేకదృష్టి సారించనున్నారు.

**మోగుతున్న ప్రమాద ఘంటికలు...** జిల్లాలోని రణస్థలం, ఎచ్చెర్ల, టెక్కలి, లావేరు, నరసన్నపేట తదితర మండలాల్లో భూగర్భజల మట్టాలు ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయి. అవసరానికి మించి వినియోగం, వర్షాభావ పరిస్థితులు, చెరువుల ఆక్రమణ కారణంగా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జిల్లాలో ఏడాదికి సగటున 3.8 మీటర్ల భూగర్భజల నీటిమట్టం తగ్గిపోతోంది. అంటే గతంలో 50 అడుగుల లోతులో లభించిన నీరు.. ఇప్పుడు 80 - 100 అడుగుల లోతుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరోపదేళ్లలో జిల్లాలో తీవ్ర నీటిఎద్దడి ఎదురుకానుంది. ప్రజలకు మరిన్ని ఇబ్బందులు ఎదురుకానున్నాయి.

**పెరుగుతున్న బోర్లు.. ఎండుతున్న చెరువులు...**

జిల్లాలో గత పదేళ్లలో బోర్‌వెల్‌ల సంఖ్య 1.45 లక్షల నుంచి 2.48 లక్షలకు చేరుకున్నట్లు సమాచారం. ఏటా వీటి సంఖ్య వేలల్లో పెరుగుతూ వస్తోంది. వేసవి మొదలు కాగానే చెరువులు కూడా ఎండిపోతున్నాయి. 2016లో సగటు వర్షపాతం 1180 మి.మీ. ఉండగా, 2025లో అది 940 మి.మీ.లుగా నమోదు కావడం గమనార్హం. అధికారులు, నాయకులు వేసవి వస్తే ట్యాంకర్లతో ప్రజల అవసరాలను తీర్చేందుకు తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు.

## ప్రాణాలు తీస్తున్న సోషల్ మీడియా.. - యువత మారాల్సిందేనా?

న్యూఢిల్లీ : లైక్స్ కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవడం ఎంతవరకు కరెక్ట్? కామారెడ్డిలో ఒక యువకుడు చేసిన పని ఇప్పుడు అందరినీ షాక్‌కు గురిచేస్తోంది. కేవలం ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యూస్ పెంచుకోవడానికి తాను ఆత్మహత్య



చేసుకుంటున్నట్లు వీడియో పెట్టి డ్రామా ఆడాడు. పోలీసులు రంగంలోకి దిగడంతో అసలు విషయం బయటపడింది. సోషల్ మీడియా పిచ్చిలో పడి యువత తమ జీవితాలతో ఎలా ఆడుకు ంటున్నారో చెప్పే ఈ ప్రత్యేక కథనం మీకోసం.. కామారెడ్డి జిల్లాకు చెందిన ఒక యువకుడు నిన్న ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఎమోషనల్ వీడియో పోస్ట్ చేశాడు. అందులో తను సూసైడ్ చేసుకుంటున్నట్లు బిల్డప్ ఇచ్చాడు. ది చూసిన నెటిజన్లు కంగారుపడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇక పోలీసులు కష్టపడి అడ్రస్ కనుక్కొని వెళ్తే, అక్కడ సీన్ చూసి వాళ్లే అవాక్కయ్యారు. ఆ యువకుడు చాలా సరదాగా గడుపుతు న్నాడు. ఎందుకు ఇలా చేశావు అని అడిగితే.. "లైక్స్, వ్యూస్ కోసమే సార్" అని సమాధానం ఇచ్చి అందరినీ ముక్కున వేలేసుకునేలా చేశాడు. ఆ యువకుడి సమాధానం విని పోలీసులు షాక్ అయ్యారు. సోషల్ మీడియాక్రేజ్ కోసంఇలాంటి తప్పుడు సమాచారంతో ప్రజలను, అధికా రులనుఇబ్బంది పెట్టడం నేరమని అతడిపై కేసునమోదు చేశారు. ఇక ఇలాంటి పనులు చేస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు. ఒక్క లైక్ కోసం జీవితాలను పణంగా పెట్టవద్దని బుద్ధి చెప్పారు.

**డిజిటల్ పిచ్చిలో పడిపోతున్న యువత:**

ఈ రోజుల్లో స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు, తామేంటో నిరూపించుకోవాలని యువత తహతహలాడుతోంది. రీల్స్ కోసం ప్రమాదకరమైన స్టంట్లు చేయడం, లేనిపోని అబద్ధాలు చెప్పడం ఫ్యాషన్ అయిపోయింది. ఇక వర్చువల్ లైక్స్ ఇచ్చే కిక్కులో పడి, కన్నవారికి కడుపు కోత మిగిల్చే పనులు చేస్తున్నారు. నిజమైన జీవితానికి, సోషల్ మీడియా ప్రపంచానికి మధ్య తేడాను యువత మర్చిపోతోంది. కేవలం ఆ యువకుడినే కాదు, ఇలాంటి వీడియోలను ఎంకరేజ్ చేసే సమాజాన్ని కూడా ప్రశ్నించుకోవాలి. ఇక ఈమధ్య ఇలాంటి వింత చేష్టలకు వ్యూస్ పెరగడం వల్లే యువత మళ్లీ మళ్లీ ఇలాంటి పనులు చేస్తోంది. సోషల్ మీడియాను వినోదం కోసం వాడాలి కానీ, అది మన ప్రాణాల మీదకు లేదా ఇతరుల ప్రశాంతతను దెబ్బతీసేలా ఉ ండకూడదు. లైక్స్ ఈరోజు వస్తాయి.. రేపు పోతాయి. కానీ నిండు ప్రాణం పోతే తిరిగి రాదు. కామారెడ్డి యువకుడి ఘటన మనందరికీ ఒక హెచ్చరిక. ఇక సోషల్ మీడియాలో హీరో అవ్వడం కంటే, నిజ జీవితంలో బాధ్యత గల వ్యక్తిగా ఉండటం ముఖ్యం. యువత ఇప్పటికైనా మారి, ఇలాంటి వెర్రి చేష్టలకు స్వస్తి చెప్పాలి అని నెటిజన్స్ కోరుతున్నారు.

## పటాన్చెరు నియోజకవర్గం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించండి..

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చేరు మే 14 (ప్రజా కలం )ప్రతినిధి

పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు గురువారం సాయంత్రం



సంగారెడ్డి లోని కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు ప్రధానంగా 2025–2026 సంవత్సరానికి సంబంధించిన స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి కోట అభివృద్ధి కోసం హెచ్ఎండిఏ అధికారులతో చర్చించడం జరిగిందని.. రెవెన్యూ శాఖ తరపున ఎన్ఓసి జారీ చేయాలని కోరారు. హెచ్ఎండిఏ నిధులతో కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. ప్రజోపయోగ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అంత్యేష్టి భవనం ప్రారంభం

### పద్మశాలి సంఘం సమాజ సేవలో మరో ముందడుగు

గజ్వేల్:14 మే 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలో గురువారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అంత్యేష్టి ( చివరి విడిది భవనం ) ప్రారంభించారు.పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు బోలిబోత్తుల దేవదాస్, పాలకవర్గం సభ్యులు



పద్మశాలి సంఘం,యువజన విభాగం ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి భవనం ప్రారంభించారు.ఈ సందర్భంగా గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ పద్మశాలి కులస్తులకు సొంత ఇల్లు లేని వారు, ప్రమాదవశాత్తు మరణిస్తే,అంతిమ సంస్కారాలకు ఇబ్బంది కలగకుండా, అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించి, సామాజిక సేవా దృక్పథంతో ఈ భవనం నిర్మించడం జరిగిందని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మూడవ వార్డ్ కౌన్సిలర్ కాముని మురళి,పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు దుర్గాప్రసాద్,రాజారాం, పద్మశాలి ప్రముఖులు,గజ్వేల్– ప్రజ్ఞాపూర్ యువజన విభాగం అధ్యక్షులు ప్రేమ్ కుమార్,లయన్ ఎల్లం రాజు,మధు సుధాన్,టి. రాజేందర్, శ్రీనివాస్,పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణంలో ముందస్తు చర్యలు

### చైర్ పర్సన్: చందన రవీందర్

గజ్వేల్:14 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని గజ్వేల్ పట్టణంలో ముందస్తు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్,16 వ కౌన్సిల్ సభ్యులు నాయిని సత్యలక్ష్మి యాదగిరి అధ్వరంలో పాత ఎంపీడీవో కార్యాలయం నుండి కోట మైసమ్మ వరకు సమస్యలను గుర్తించినట్లు ఆమె చెప్పారు. మురికి కాల్వ నిర్మాణం ఇతర పనులపై దృష్టి పెడతామని ఆమె అన్నారు. నిధుల విషయంలో చర్చిస్తున్నట్టు చెప్పారు.వర్షం కాలంలో వరద నీరుకు సమస్య రావద్దని డ్రైనేజీ లో ఉన్న మురికి తుమ్మలు ఇతర చెత్తాచెదారిని తొలగించే ప్రయత్నం చేస్తున్నామని దీనికి ప్రజలు సహకరించవలసిన అవసరం ఉందన్నారు.గజ్వేల్ ఎంపీడీవో కార్యాలయం నుండి కోట మైసమ్మ రోడ్డు వరకు రోడ్డును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో వర్షం వస్తే సమస్యలు ఏర్పాటు సందర్భించి చర్యలు తీసుకుంటూమని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మ నర్సింహారావు,కౌన్సిల్ సభ్యులు మామిడి శ్రీధర్,నక్క సంతోషి రాములు, గుంటుక లక్ష్మి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఆగస్టు 16న గణేష్ గడ్డ సిద్ధి వినాయక దేవాలయం రాజ గోపురాల ప్రారంభోత్సవం..

## సాలహారం పనులను వేగవంతం చేయండి..

### - గణేష్ గడ్డ దేవాలయం అభివృద్ధికి కృషి.. -పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. ఒక కోటి 50 లక్షల రూపాయల సొంత నిధులతో రాజగోపురాల నిర్మాణం..



పటాన్ చేరు మే14 (ప్రజాకాలం )ప్రతినిధి

పటాన్చెరు గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయం ఆవరణలో నిర్మించిన మూడు రాజగోపురాలను ఆగస్టు 16వ తేదీన ప్రారంభించబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అదే రోజు ఆలయ శిఖర ప్రతిష్టాపన సైతం నిర్వహించబోతున్నట్లు తెలిపారు గురువారం ఉదయం గణేష్ గడ్డ దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పాలక వర్గం, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, ఆలయ ధర్మకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు,అధికారులతో కలిసి ఆలయ అభివృద్ధి పై సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడికి నాలుగు వైపుల నిర్మిస్తున్న రాజ గోపురాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఒక కోటి 50 లక్షల రూపాయల సొంత నిధులతో వీటిని నిర్మించినట్లు తెలిపారు. ఆలయంలో నిర్మిస్తున్న సాలహారం పనులు మందకొడిగా కొనసాగడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు ఆలయ పురోహితులు, పాలకవర్గం సూచనలతో ప్రారంభోత్సవ తేదీని నిర్ణయించినట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గుడిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆలయానికి అదనపు ఆదాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీలు గాయత్రి పాండు, శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, నరసింహారెడ్డి, వెంకన్న, స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి లావణ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## చైన్ స్నాచింగ్ కేసులో ఆర్మీ జవాన్ ను అరెస్టు చేసిన నేరేడ్మెట్ పోలీసులు

మల్కాజిగిరి,మే14 (ప్రజా కలం ప్రతినిధి)

క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడుతూ చైన్ స్నాచింగ్ చేసిన ఆర్మీ జవాన్ ను నేరేడ్మెట్ పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్ కు తరలించారు.మల్కాజిగిరి ఏసిపి యాదగిరి రెడ్డి మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

విశ్వసనీయ సమాచారం ఆధారంగా నేరేడ్మెట్ పోలీసులు బుధవారం రాత్రి 10:30 గంటలకు అల్వాల్ లోని డాల్ఫిన్ వైన్ షాప్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని

అరెస్ట్ అయిన నిందితుడు కుర్రపోతుల రెడ్డి శేఖర్ (31)ఆర్మీలో జనరల్ డ్యూటీ జవాన్గా పనిచేస్తూ అల్వాల్ లోని త్రిశూల్ లైన్ ఆర్మీ క్వార్టర్స్లో నివాసం ఉంటున్నాడు.స్వస్థలం వైఎస్సార్ కడప జిల్లా సంబేపల్లె మండలం గోరవంద్లపల్లి గ్రామం. నిందితుడు క్రికెట్ బెట్టింగ్కు అలవాటు పడి భారీ అప్పుల్లో కూరుకుపోయాడని. అప్పులు తీర్చేందుకు డబ్బు కోసం మహిళల బంగారు గొలుసులు లాక్కోవాలని నిర్ణయించుకోని

మే 10వ తేదీ సాయంత్రం తన బజాజ్ పల్సర్ బైక్పై బయటకు వచ్చిన నిందితుడు,ముందుగా డాల్ఫిన్ వైన్ షాప్ దగ్గర పాన్ షాప్ వద్ద ఆగి,సీసీ కెమెరాల్లో గుర్తుపట్టకుండా ఉండేందుకు తన బైక్ నంబర్ ప్లేట్ను మార్చాడు. అసలు నంబర్ ాూ 04 దీశ 7477 స్థానంలో నకిలీ స్టికర్ ాూ 04 ాూశ 8474ను లక్ష్మీ రేడియం అండ్ ఫ్లెక్స్ ప్రింటింగ్ వద్ద తయారు చేయించుకున్నాడు.

తర్వాత సప్తగిరి కాలనీలో నివాసం ఉంటున్న జొన్నగడ్డ యోగేందర్ మణి మేఘల (57) అనే గృహిణిని లక్ష్యంగా చేసుకున్నాడు.అడ్రస్ అడుగుతున్నట్లు నటించి ఆమె మెడలో ఉన్న సుమారు 3 తులాల



నల్లపూసల బంగారు గొలుసును లాక్కొని బైక్పై పరారయ్యాడు.బంగారు గొలుసును ముత్తూట్ ఫైనాన్స్ లో తాకట్టు పెట్టి డబ్బుగా మార్చుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్,సాంకేతిక ఆధారాల సహాయంతో విచారణ చేపట్టి నిందితుడిని గుర్తించారు. అనంతరం పక్కా సమాచారంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసును డీసీపీ మల్కాజిగిరి జోన్ శ్రీధర్ ఐపీఎస్ పర్యవేక్షణలో, ఏసీపీ మల్కాజిగిరి శ్రీ వి.యాదగిరి రెడ్డి మార్గదర్శకత్వంలో నేరేడ్మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్,ఎస్సై చంద్రశేఖర్ మరియు క్రైమ్ స్టాఫ్ బృందం కలిసి కేసు చేదించి నిందితుడిని పట్టుకొని రిమాండ్ కు తరలించామని ఏసిపి నేరేడుమెట్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు.

### ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్ ల పై నియంత్రణ పెంచాలి

## తనిఖీలు నిర్వహించాలి

### -అర్హత గల డాక్టర్ లేకుండా నిర్వహిస్తున్న హాస్పటల్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

### -సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్

గజ్వేల్:14 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలో పుట్టగొడుగుల వలె వెలుస్తున్న ప్రైవేట్ ఆస్పత్రిలు, ల్యాబ్ ల పైన నియంత్రణ చర్యలు చేపట్టాలని, డాక్టర్స్ లేకుండా నిర్వహిస్తున్న హాస్పిటలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిపిఐ ఏం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గజ్వేల్ పట్టణంలో సుమారు 100 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు గల్లి గల్లి లో ఉన్నాయని అనేక ఆసుపత్రిలో డాక్టర్ లేకుండా నర్సులు కాంపౌండర్ లే వైద్యం అందించడం జరుగుతుందని,మందులు రాయడం జరుగుతుందని అన్నారు కొన్ని సందర్భాల్లో వాట్సాప్ ద్వారా చూపిస్తూ వైద్యం చేస్తున్నారని దీంతో ప్రజలకు ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నదని అన్నారు,హాస్పిటల్ తో పాటు ల్యాబ్ పెట్టడంతో అవసరం ఉన్నా లేకున్నా వివిధ రూపాల టెస్టులు రాస్తూ ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నారని,ప్రతి ట్రీట్మెంట్ కు ప్యాకేజీలు నిర్ణయిస్తూ ప్రజలకు అత్యవసర వైద్యం అందకుండా చేస్తున్నారని అప్పుల పాలు చేయడం జరుగుతుందని అన్నారు ప్రైవేట్ ల్యాబ్ లో సరైన టెక్నీషియన్స్ లేకుండా పరీక్ష నిర్వహిస్తున్నారని దీంతో రిపోర్టులు తారుమారుగా వస్తున్నాయని అన్నారు. కొన్ని సందర్భాల్లో డాక్టర్లు మరియు ల్యాబ్ ఓనర్లు కలిసిపోయి ప్రజలను లూటీ చేస్తున్నారని అన్నారు.ఆస్పత్రులు ఇరుకు గదులు,గాలి సౌకర్యం,అగ్నిమాపక సౌకర్యాలు లేకుండా భవనాలలో ఆసుపత్రులు కొనసాగిస్తున్నారని అన్నారు.జిల్లా పర్యవేక్షణ అధికారులు ప్రైవేట్ డాక్టర్ తో కుమ్మక్కై ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరిపి డాక్టర్ లేకున్నా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రిలో పై చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫీజులు నియంత్రించాలని డిమాండ్ చేశారు.లేనిచో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు.






## 16 వ వార్డ్ లో ఘనంగా ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవం

### కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

### - డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి

గజ్వేల్:14 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో గురువారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.స్థానిక కౌన్సిలర్ నాయిని సత్యలక్ష్మి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి,గజ్వేల్ మార్కెట్




కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి,సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా లబ్ధిదారుల కొత్త ఇళ్లలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, నాయకులు పాల్గొని ఆశీర్వదించారు.నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన కుటుంబాలకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నేతలు మాట్లాడుతూ,ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి పేదవారికి గూడు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, డైరెక్టర్లు,కౌన్సిలర్లు గుంటుకు లక్ష్మి శ్రీనివాస్,రమేశ్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షుడు మోనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్,సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్,వూడెం శ్రీనివాస్ రెడ్డి,హనుమండ్ల నాగరాజు నేత, కొండల్ రెడ్డి,గుండు లక్ష్మణ్,గాజుల శ్రీనివాస్, సత్యనారాయణ,శ్రవణ్, మామిడి సురేష్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, స్థానిక నాయకులు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం

### : కౌన్సిలర్ గుంటుకు లక్ష్మి శ్రీనివాస్

గజ్వేల్:14 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని యోగా శిక్షకురాలు అనిత గురువు,14వ వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మి శ్రీనివాస్ అన్నారు. గురువారం గజ్వేల్–



ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిబిరంలో భాగంగా 5వ రోజు ప్రత్యేక యోగా తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని తెలిపారు. చిన్నారులు యోగాతో పాటు భగవద్గీత శ్లోకాలను కూడా చక్కగా నేర్చుకోవాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు.ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు భారత్ నగర్ వినాయక మండపం వద్ద ఈ యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు వైకాపా మహా ధర్నా

అనంతపురం : ఆత్మగౌరవం కోసం అనంతపురంలో రైతులు రోడ్డెక్కారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అనంతపురం కలెక్టర్ కార్యాలయం ముందు సింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన రైతులు ధర్నాలో పాల్గొని తమ ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కొరతతో ఎండిపోయిన చీని చెట్లు, గిట్టుబాటు ధరలు లేక నష్టాల్లో ఉన్న పంటలను కలెక్టర్ కార్యాలయం ముందు ప్రదర్శిస్తూ రైతులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి వ్యవసాయ రంగమే ప్రధాన ఆధారం అయినప్పటికీ, అన్నం పెట్టే రైతన్న దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.




# ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ లో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలి

## టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి మే 14( ప్రజా కలం):

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ లో ప్రజలందరూ తప్పక పాల్గొనాలని సూచించారు టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి. సంగారెడ్డి మున్సిపాలిటీ లోని 24 వ వార్డులో SIR పై ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్క్ కార్యక్రమం లో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర సవరణ పై అపోహాలు వదిలేయాలని కోరారు. దీనివల్ల ఎవరి ఓటు హక్కు కోల్పోరని అన్నారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారికి ఒకటే దగ్గర ఓటు హక్కు పరిమితం అవుతుంది అన్నారు. సమగ్ర సవరణ వల్ల ఓటర్లలో జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ నవాజ్, సోహైల్, బబ్బు , సంగారెడ్డి తహశీల్దార్ జైరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్.

## ధాన్యం బస్తాల అన్లోడ్, మిల్లింగ్ ప్రక్రియల పరిశీలన.

సంగారెడ్డి ప్రతినిధి , మే 14( ప్రజా కలం ):

జోగిపేట లోని రామకృష్ణ రైస్ మిల్లు, , పుల్కల్ మండలం కోడూరు లోని ఎస్ బి ఎం రైస్ మిల్లును అడిషనల్ కలెక్టర్ పాండు గురువారం ఆకస్మికంగా



తనిఖీలు చేశారు. మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల ధాన్యం పంపించారు, వాటిని అన్లోడ్ చేసుకున్నారా, ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిపారు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎలా భద్రపరుస్తున్నారు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. మిల్లుల వద్ద ఏమైనా తరుగు తీస్తున్నారా అని ఆరా తీశారు. ఎక్కువగా ఏ రకం ధాన్యం వస్తోందని వివరాలు సేకరించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని వెంటదివెంట అన్లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోకపోతే అకాల వర్షాల వల్ల తడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. అవసరమైతే ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో మిల్లింగ్ చేయాలని హితవు పలికారు. ధాన్యం నిల్వ చేసేందుకు సమీపంలోని రైతు వేదికలను వినియోగించుకోవాలని తెలిపారు. మిల్లుల వద్ద ధాన్యం బస్తాలను అన్లోడ్ చేసుకునే విషయంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు.

# భూసేకరణ చెట్టం 2013 అనుసరించి రైతులకు న్యాయం చేస్తాం

## కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి

మహేశ్వరం, మే 14, (ప్రజా కలం)

భూసేకరణ చెట్టం 2013 అనుసరించి రైతులకు న్యాయం చేస్తాం అని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మహేశ్వరం మండలం కొంగరాఖుర్దు రెవిన్యూ గ్రామాల పరిధి లో రేడియల్ రోడ్ కోసం భూములు సేకరిస్తున్నందున సదరు రైతులతో గురువారం నాడు జడ్పీ హై స్కూల్ రావిర్యాల లో రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, కందుకూరు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. భూమి సేకరిస్తున్న రెడీయల్ రోడ్ విషయం ప్రాముఖ్యత రైతులకు ప్రజలకు వివరించి, రైతుల సందేహాలను నివృత్తి చేయటం జరిగింది. రైతు అభిప్రాయాలు భూసేకరణ చెట్టం 2013 అనుసరించి తగు నాయ్యం చేస్తాం అని అన్నారు. ఈ గ్రామ సభ లొ కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, డిటి రాజు, మహేశ్వరం ఆర్ ఐ రాజు రెడ్డి , కొంగరకూర్ద్ జిపిఓ అరుణ్ కుమార్, హెచ్ఎండిఏ అధికారులు రాజివ్ దివ్య రెడ్డి పాల్గొన్నారు.







# నేడు సంగారెడ్డి లో భారీ పరిశ్రమకు శంఖుస్థాపన

-సంగారెడ్డి నియోజకవర్గంలో రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీ
-మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్--XXకి శ్రీకారం
-1,500 మందికి స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు -జగ్గారెడ్డి, నిర్మల కృషితో ముందుకు వచ్చిన ప్రాజెక్ట్
-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహం తో , మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి సహకారంతో సంగారెడ్డి కి తరలివచ్చిన పరిశ్రమ కొండాపూర్ మండలం తొగర్పల్లి, అలియాబాద్ గ్రామం లో కేజేఎస్ పరిశ్రమ కు నేడు శంకుస్థాపన చేయనున్న పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ
--స్థానిక యువతకు ఉపాధి -- తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి ఊతం.
కాన్ఫెక్షనరీ నుంచి బేవరేజెస్ వరకు విస్తృత ఉత్పత్తుల తయారీ - పాశమైలారం తర్వాత తొగర్పల్లిలో మరో భారీ యూనిట్

సంగారెడ్డి ప్రతినిధి మే 14( ప్రజా కలం):

సంగారెడ్డి నియోజకవర్గంలో మహిళలకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే మరో భారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. కే జే ఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. ఆధ్వర్యంలో కొండాపూర్ మండలం తొగర్పల్లి--అలియాబాద్ ప్రాంతంలో "కేజేఎస్ యూనిట్--××" పేరుతో సమగ్ర ఆహార ఊ పానీయాల తయారీ కేంద్రానికి రేపు మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి లు భూమిపూజ చేయనున్నారు.

సుమారు రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా దాదాపు 1,500 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం పాశమైలారం యూనిట్లోనే వందలాది మహిళలు పనిచేస్తుండటం విశేషం.సంగారెడ్డి నియోజకవర్గం లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యం తో ఇక్కడే పరిశ్రమ నెలకొల్పాలని టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి , టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి లు కోరారని, వారి కృషి తోనే పరిశ్రమ స్థాపన కు ముందుకు వచ్చామని పరిశ్రమ ప్రతినిధులు తెలియజేశారు.

తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రోత్సాహంతో, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్ఛార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి ల సహకారంతో పరిశ్రమ స్థాపనకు వేగం చేకూరిందన్నారు.
సంగారెడ్డిని ఫుడ్ ఊ ఎఫ్ ఎం జసి హబ్గా తీర్చిదిద్దే దిశగా అడుగు కాన్ఫెక్షనరీ, బేవరేజెస్, కాఫీ, న్యూట్రాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగాలతో ఏర్పడనున్న ఈ యూనిట్ తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి, స్థానిక యువతకు మరియు మహిళలకు ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషించనుంది. సంగారెడ్డి మహిళలకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పరిశ్రమ రావడం ఒక మహిళ గా ఇది నాకు గర్వ కారణం
టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి నియోజకవర్గం లో 1500 మహిళలకు ఈ పరిశ్రమ ద్వారా ఉపాధి లభిస్తుండటం సంతోషంగా ఉంది. ఒక మహిళగా ఇది నాకు గర్వ కారణం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకట స్వామి ల సహకారం వల్లనే ఇది సాధ్యమైంది.

# బండి భగీరథను అరెస్టు చేయాలి

## విచారణ పేరుతో జాప్యం చేస్తున్న ప్రభుత్వం

## .సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు



రాజేంద్రనగర్, మే 14, (ప్రజా కలం)

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు బండి భగీరథ 17 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచార ప్రయత్నం చేసిన ఆరోపణలపై ఫోక్సో కేస్ ఎదురుకుంటున్న భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు డిమాండ్ గురువారం నాడు శంషాబాద్ పట్టణంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. తండ్రి హోంమంత్రి కావడంతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని భగీరథ చేసే నేరాలు అన్ని ఇన్ని కావు అని గతంలో ఎన్నో దుర్ఘటనలో బండి భగీరథ నేరస్తుడని ఆనాటి నుండి భగీరథ ప్రవర్తనలో ఎలాంటి మార్పు లేదని ఆయన తెలిపారు. 17 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించే అత్యాచార ప్రయత్నం చేయడం దుర్మార్గమని ఇలాంటి నిందితులను సమాజం క్షమించకూడదని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కొడుకు చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి తండ్రి బండి సంజయ్ తాను కేంద్ర మంత్రిని అని మరిచిపోయి వివిధ సభలలో ప్రశ్నించిన వాళ్లను బెదిరించే పద్ధతిలో మాట్లాడటం హేయమైన చర్య అని ఆయన అన్నారు. తండ్రిగా ఫెయిల్ అయిన బండి సంజయ్ కనీసం మంత్రిగా నైనా చట్టాలను ప్రజాస్వామ్యాన్ని గౌరవించి తన కొడుకు తప్పును అర్థం చేసుకొని పోలీసులకు పట్టించే బాధ్యత నుండి వైదొలిగి కొడుకును కాపాడడానికి తన మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాడని ఆయన విమర్శించారు. ఈ కేసును కప్పిపుచ్చుకోవడానికి జైశ్రీరామ్ జై హనుమంతు అని నినాదాలు చేస్తూ యువతను ఈ కేసు పై ఆలోచన చేయకుండా చేయడానికి బండి సంజయ్ ప్రయత్నం చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. బిజెపికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా బండి సంజయ్ ని మంత్రివర్గం నుండి తప్పించి పార్టీ పరువు కాపాడుకోవాలని ఆయన సూచించారు. విలేకరుల సమావేశంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు ఆర్ యాదగిరి మండల కార్యదర్శి నర్రగిరి పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమం విజయవంతం.

సిద్దిపేట ప్రజాకలం మే 14.

రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన బడిబాట కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు.
చదువే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ, ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు మంచి అలవాట్లు నేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పలు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరప్రసాద్, రజిని, రాజయ్య, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, ఏపీసీ చైర్పర్సన్ నర్సవ్వ, విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నాటు తుపాకితో కాల్చుకొని ఒకరి ఆత్మహత్య

**- భార్యాభర్తల మధ్య గొడవే కారణం...**

**- భర్త మరణ వార్త తెలిసి**

**భార్య కూడా ఆత్మహత్యాయత్నం కాపాడిన గ్రామస్తులు**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 14 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం మోతే గ్రామంలో గురువారం జరిగిన భార్యా భర్తల గొడవ నేపథ్యంలో ఓ వ్యక్తి నాటు తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపేట మండలంలోని మోతే గ్రామానికి చెందిన తిలిపితియా ఇంద్రజిత్ సింగ్ (28) అతని భార్య తరచు గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలోనే గురువారం వారిద్దరు గొడవ పడుతూ నేను చనిపోతాను అంటే కాదు నేను కూడా చనిపోతానని వాదించుకున్నారు. దాంతో ఇంద్రజిత్ సింగ్ ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులను బయటకు పంపి గదిలోకి వెళ్లి, తన వద్ద ఉన్న నాటు తుపాకీతో చాతిపై కాల్చుకున్నాడు.

దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త మరణ వార్త విన్న ఇంద్రజిత్ సింగ్ భార్య మనస్థాపంతో గ్రామ సమీపంలోని కుడి కుంటలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీనిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. నాటు తుపాకీ దాచిన స్థానికులు ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందని నిరూపించేందుకు ప్రయత్నించారు. మృతుడు కాల్చుకున్న నాటు తుపాకీని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు లింగంపేట ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు.

# లైంగిక వికాసంలో జన్యుశాస్త్రం కీలకం

## DSD నిర్వహణలో బహుశాఖల సమన్వయం అవసరం : డా. ఎ. నరేంద్ర కుమార్



హైదరాబాద్, మే 14 (ప్రజా కలం ప్రతినిధి)

డిజార్డర్స్ ఆఫ్ సెక్సువల్ డెవలప్మెంట్ (DSD) బహుశాఖల సమన్వయ విధానం అనే అంశంపై మే 14, 2025 న ఉస్మానియా మెడికల్ కాలేజ్ (Department of Anatomy) శరీర నిర్మాణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ఇన్ స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ ఒ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్ లో ప్రీ- కాన్ఫరెన్స్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (CME) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

ఈ జవీజు కార్యక్రమానికి శరీర నిర్మాణ శాస్త్ర విభాగాధిపతి మరియు వైస్ ప్రిన్సిపాల్ (అకాడెమిక్స్) డా. ఎం. పద్మావతి, అలాగే ఇన్ స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ ఒ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్ ఇన్ చార్జ్ డైరెక్టర్ డా. బి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు..
కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో ఎం. పద్మావతి కీలక పాత్ర పోషించారు.

ఈ కార్యక్రమానికి డా. ఎ. నరేంద్ర కుమార్ డా రాకేష్ కుమార్ సహాయ్, డా. వి. సుభద్రా దేవి మరియు డా. జాయ్ ఎ. ఘోషాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉదయం 8:30 గంటలకు రిజిస్ట్రేషన్ తో కార్యక్రమం ప్రారంభమై అనంతరం ప్రారంభ సమావేశం మరియు వివిధ వైద్య రంగాలకు చెందిన ప్రముఖ నిపుణుల శాస్త్రీయ ఉపన్యాసాలు నిర్వహించబడ్డాయి.
డా. ఎ. నరేంద్ర కుమార్ "DSD నిర్వహణలో శస్త్రచికిత్సా దృక్కోణం " మరియు DSD జన్యుశాస్త్ర ప్రాముఖ్యతను వివరించారు.
డా. వి. సుభద్రా దేవి " లైంగిక భేదీకరణ యొక్క భ్రూణ శాస్త్ర ఆధారం " అనే అంశంపై ప్రధాన ఉపన్యాసం అందించారు.ప్రత్యేక ఆహ్వానిత నిపుణుడిగా పాల్గొన్న డా. జాయ్ ఎ ఘోషాల్ ఋణ నిర్ధారణ మరియు ఆధునిక నిర్వహణలో బహుశాఖల సమన్వయ విధానం ప్రాముఖ్యతపై విలువైన సూచనలు చేశారు. డా. రాజేష్ కుమార్ సహాయ్" డిజార్డర్స్ ఆఫ్ సెక్సువల్ డెవలప్మెంట్ లో ఎండోక్రైన్ దృక్కోణం " అనే అంశాన్ని వివరించారు. తదుపరి శాస్త్రీయ సమావేశాల్లో డా ఎం. సుజాత " అస్పష్ట జననేంద్రియాలతో పుట్టిన శిశువుకు వైద్య విధానం- నిర్ధారణ. జన్యు సలహా మరియు నిర్వహణ " అనే అంశంపై డా. బి. విజయలక్ష్మి "నవజాత శిశు స్క్రీనింగ్ ద్వారా DSD ప్రారంభ నిర్ధారణ " అనే అంశంపై, అలాగే డా. బి. శ్రీనాథ్ మరియు డా. విజయ్ "ఋణ అనుమానిత కేసుల్లో గర్భధారణ సమయంలో అల్ట్రాసౌండ్ సూచికలు " అనే అంశంపై ఉపన్యాసాలు అందించారు.
మధ్యాహ్నం సెషన్ లో డా.టి. సునీత ఆధ్వర్యంలో ప్రాయోగిక వైద్య పరిస్థితులపై కేసు ఆధారిత చర్చలు నిర్వహించబడ్డాయి. అనంతరం మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు హ్యాండ్స్ ఆన్ డెమోన్స్ట్రేషన్ సెషన్లు నిర్వహించారు. ఈ జవీజు కార్యక్రమం ద్వారా వైద్యులు, అధ్యాపకులు పీజీ విద్యార్థులు మరియు ఆరోగ్య రంగ నిపుణులు ఋణ నిర్ధారణ మరియు నిర్వహణలో సమన్వయపూర్వక బహుశాఖల వైద్య సేవల ప్రాముఖ్యతపై తమ అవగాహనను మరింత విస్తరించుకునే అవకాశం పొందారు.



# పేదరికాన్ని జయించిన ప్రతిభ

**- వేములవాడ విద్యార్థి సృజన్‌కు తెలంగాణ ప్రభుత్వ ఘన సత్కారం.**

**-రూ.10 వేల నగదు ప్రశంసా పత్రం అందజేత.**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో సయ్యద్ అలీ.(ప్రజా కలం ప్రతినిధి). రాజన్న సిరిసిల్ల, వేములవాడ,మే 14 : వేములవాడ పట్టణానికి చెందిన వెల్దండి సృజన్ తన ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు.నిరుపేద కుటుంబానికి చెందిన ఈ యువ విద్యార్థి కష్టపడి




చదివి ఇంటర్మీడియట్‌లో 477 మార్కులు సాధించి ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని పొందడం విశేషంగా నిలిచింది. వేములవాడ పట్టణానికి చెందిన వెల్దండి సదానందం,భవాని దంపతుల మూడవ సంతానమైన సృజన్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్నాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి తెలంగాణ రాష్ట్ర వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రియాంక చేతుల మీదుగా ఈ ప్రోత్సాహకాన్ని స్వీకరించడం కుటుంబ సభ్యులకు మరింత ఆనందాన్ని కలిగించిందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తన మూడవ కుమారుడు సృజన్ పట్టుదలతో చదివి విజయం సాధించడం తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నాడని స్థానికులు ప్రశంసిస్తున్నారు.సృజన్ కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, బంధువులు, స్థానికులు సృజన్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# తుమ్మల రాజకీయ ప్రస్థానానికి ప్రత్యేక శుభాకాంక్షలు

**-తుమ్మలది సుధీర్ఘ రాజకీయ ప్రస్థానం**

**-మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నేటికీ 40 ఏళ్లు -శ్రీనివాస్ బాబు**



కూకట్ పల్లి, మే 24, ప్రజా కలం ప్రతినిధి:

నిరుపేదల కోసం, నిరు పేద రైతుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నేటికీ 40 ఏళ్ల పూర్తి చేసుకోవడం హర్షనీయమని వసంత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిలారు శ్రీనివాస్ బాబు అన్నారు. గురువారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తన రాజకీయ ప్రస్థానం అంతా రైతుల అభ్యున్నతికి, నిరుపేదల సంక్షేమం కోసమే సాగుతుందన్నారు. తన కలల మానస పుత్రిక సీతారామ ప్రాజెక్టు కోసం మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అలుపెరుగని కృషి చేస్తున్నారన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంతో కొన్ని లక్షల ఏకరాల భూమి సస్యాశామలం ఆవుతుందని, రైతు ఆనందమే దేశానికి ఆయుష్షు అని నమ్మే నిజమైన ప్రజా నాయకుడు తుమ్మల నాగేశ్వర్ రావు అనడంలో సందేహం లేదన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో నిరుపేదల ఆకలి తీర్చడం కోసం, రైతుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం గా ఆయన ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణా రాజకీయాల్లో ఆయనది ప్రత్యేక ముద్ర కనిపిస్తుందన్నారు. తుమ్మల నాగేశ్వర్ రావు సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నారని, మరెన్నో పదవులకు వన్నె తెచ్చారన్నారు. కేవలం ఖమ్మం జిల్లాకే కాకుండా రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగిన తుమ్మల నాగేశ్వర్ రావు మంత్రిగా 40 ఏళ్ల మైలు ని చేరుకోవడం ఆయన నిస్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు.




# జిల్లా గ్రంథాలయాల అభివృద్ధిపై కలెక్టర్‌తో చర్చించిన దరిపల్లి చంద్రం.

సిద్దిపేట మే 14 (ప్రజా కలం ప్రతినిధి): సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దరిపల్లి చంద్రం గురువారం జిల్లా కలెక్టర్ కే.హైమావతిని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సౌకర్యాల కల్పన, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయాలను ఆధునీకరించే అంశాలపై వారు చర్చించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దరిపల్లి చంద్రంను జిల్లా కలెక్టర్ అభినందిస్తూ, గ్రంథాలయాల పురోభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ఐలలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

**- అక్రమ సెల్లార్ నిర్మాణాలకు అడ్డగా కాటేదాన్ ఐల**

**- 111 జీవోకు విరుద్ధంగా భారీ గా అక్రమ నిర్మాణాలు**

**- అక్రమ నిర్మాణాలు జరుగుతున్న పట్టించుకోని ఐల అధికారులు**



రాజేంద్రనగర్, మే 14,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవ్పల్లి కాటేదాన్ ఐలాలో భారీగా సెల్లార్ అక్రమ నిర్మాణం జరుగుతుంది. 111 జీవో కు విరుద్ధంగా భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ఐల అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల పలువురు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ నిర్మాణం చేయడం పట్ల స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న ఐల అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. యదేచ్ఛగా ఎలాంటి అనుమతులు లేకున్నా భారీగా అక్రమ నిర్మాణాలు ఎలా చేపడుతున్నారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు ముడుపులు ముడుతున్నాయా అనే సందేహం కలుగుతుందని స్థానిక ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.



# దివంగత ఏఎస్ఐ కుటుంబానికి సిపి చేతుల మీదుగా సహోద్యోగులు ఆర్థిక సాయం

మల్కాజిగిరి,మే 14(ప్రజా కలం ప్రతినిధి):తమతో కలిసి పనిచేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా 1993 బ్యాచ్ కానిస్టేబుల్ ఆర్ సుభాష్ అనారోగ్య కారణాలతో గత మార్చి నెలలో చనిపోయాగా వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా,మానవత దృక్పథం తోటి సహ ఉద్యోగులు 2లక్షల 62000 చెక్కును గురువారం మల్కాజిగిరి సిపి కార్యాలయంలో సిపి శ్రీమతి బి.సుమతి ఐపీఎస్ చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా సిపి 1993 బ్యాచ్ వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో బ్యాచ్మెట్స్ నాగభూషణం,రామకృష్ణ గౌడ్,శ్యాంసుందర్, సుధాకర్,రవుఫ్ ఖాన్, భద్రారెడ్డి పాల్గొన్నారు.



# పాలెం పాఠశాలలో ఘనంగా బడిబాట

## పదవ తరగతి టాపర్లకు నగదు బహుమతులు, పుస్తకాల పంపిణీ






నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 14:

మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం బడిబాట ర్యాలీ, తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించారు. పాలెం గ్రామ సర్పంచ్ పలిగిరి రాధ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. 2025-26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ గంగాధర్ నగదు పురస్కారాలను అందజేశారు. టాపర్లుగా నిలిచిన జైనాబ్



ఫాతిమాకు ?2,000, ఆస్మా బేగం కు 1,000, రాణికి 500 నగదు బహుమతితో పాటు మెమెంటో,శాలువాతో ఘనంగా సత్కరించారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరినీ ప్రోత్సహిస్తూ బీసీ,ఎస్సీ, ఎస్టీ-జేఏసి మోర్తాడ్ అధ్యక్షులు ఉమేష్ మహారాజ్, ధర్మ మహిళా జాగృతి మోర్తాడ్ మండల కన్వీనర్ బోడ అలేఖ్య మహారాణి గార్లు సావిత్రిబాయి పూలే, జ్యోతిబాపూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్రలు మరియు భారత రాజ్యాంగం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింతగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని,తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాలెం గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ పలిగిరి రాధ ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహించిన డాక్టర్ గంగాధర్, ఉమేష్ మహారాజ్ ,అలేఖ్య గార్లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు, ఉపాధ్యాయ బృందం మహేష్ కుమార్, చంద్రశేఖర్, నరసింహస్వామి, రాజేందర్, జయశ్రీ,నచ్చయ్య జర్నలిస్టులైన సామ్రాట్ అశోక్, అంగులి మాల తదితరులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.





## మాచాపూర్ బడిబాట కార్యక్రమం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 14 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్ గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించినట్లు మండల విద్యాధికారి రాజులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి తమ పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందన్నారు. అనంతరం జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఎంఈఓ మాట్లాడి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోని చేర్పించాలని కోరారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 26 మంది విద్యార్థులకు గాను 25 మంది పాస్ అవ్వడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. వీరిలో ముగ్గురు 500 పైన మార్కుల సాధించగా 400 పైన 14 మంది విద్యార్థులు మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. నందిని అనే విద్యార్థిని 575 మార్కులతో మండలంలో రెండవ స్థానంలో నిలిచిందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్ లో రోడ్డు వెడల్పు సర్వే పనులు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 14 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు వెడల్పు పనులపై గురువారం



పంచాయతీరాజ్ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ అయ్యాలా సాయిలు మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కృషితో తమ గ్రామానికి వెళ్లే రోడ్డు వెడల్పు పనుల సర్వే కొనసాగుతుందన్నారు. వర్షాకాలంలో ఈ రోడ్డు పై ప్రయాణించాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవారమని, ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తయితే రాకపోకలకు బాగుంటుందన్నారు. గ్రామ ప్రజల తరఫున రోడ్డు బాగు కోసం నిధులు మంజూరు చేస్తే ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పంతులు మహేందర్, పంచాయతీరాజ్ శాఖ డీఈ నరసింహ, ఏఈ పిచ్చయ్య, కాంట్రాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## డొంకేశ్వర్‌లో నూతన తహసిల్దార్ జి. ప్రసాద్‌కు ఘన సన్మానం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 14:

మండల నూతన తహసిల్దారుగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన జి. ప్రసాద్ గారిని గురువారం పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అఖిల భారతీయ విశ్వకర్మ తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మహిపాల్ చారి, డొంకేశ్వర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్ తహసిల్దార్ కార్యాలయంలో ఆయనను ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన తహసిల్దారుకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.మండల ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి, స్థానిక ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందించాలని వారు ఈ సందర్భంగా తహసిల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశాం

### - కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 14 ప్రజాకలం : రానున్న బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకునేందు కు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఇందులో భాగంగా 24 గంటలు పనిచేసే ప్రత్యేక జిల్లా పోలీస్ కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రధాన సరిహద్దు ప్రాంతాల్లో ఆరు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ కొనసాగిస్తు న్నామన్నారు. ప్రజలు ఎవరైనా అనుమానాస్పద ఘటనలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 87126 86133 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. వాహనాలను ఆపడం, తనిఖీలు చేయడం వంటి అధికారం కేవలం ప్రభుత్వ విభాగాలకే ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. వ్యక్తులు లేదా సంస్థలు స్వయంగా తనిఖీలకు దిగితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే పోస్టులు, మత సామరస్యాన్ని దెబ్బతీసే వీడియోలు ప్రచారం చేసే వారిపై నిరంతరం పోలీసు నిఘా ఉంటుందన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అవసరమైన శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఎనిమిది రోజుల్లో ధానాన్ని తరలించాలి

- రైతు కష్టాన్ని మిల్లర్ల పాలు చేయనివ్వం
- మిల్లర్ల అదనపు కోతపై ఆగ్రహం
- యుద్ధ ప్రాతిపదికన ధాన్యం సేకరణ పూర్తి చేయాలి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, మే 13: కలెక్టర్ మాట ఇచ్చిన ప్రకారం ఈ రోజు నుంచి ఎనిమిది రోజుల్లోగా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, కల్లాల వద్ద రైతులతో మాట్లాడి ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను



తెలుసుకున్నారు. అక్కడి నుంచే అడిషనల్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోనాసముందర్ కేంద్రంలో ధాన్యం నిల్వలు పెరిగి పోతున్నాయని, ప్రస్తుతం వస్తున్న రెండు లారీలు సరిపోవన్నారు. వానాకాలం సమీపిస్తున్న తరుణంలో ధాన్యం తడవకుండా ఉండాలంటే లారీల సంఖ్యను పెంచి, కలెక్టర్ ఇచ్చిన మాట ప్రకారం ధాన్యం సేకరణ పూర్తి చేయాలని సూచించారు. నిజామాబాద్‌లోని భువనేశ్వర్ రైస్ మిల్ వారు సంచికి 43 కిలోల చొప్పున అడుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. రైతుల కష్టాన్ని మిల్లర్ల పాలు చేయనివ్వమని, ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్లు వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సంచికి 41.5 కిలోల చొప్పున మాత్రమే ధాన్యం తీసుకోవాలని స్పష్టం చేశారు. బషీరాబాద్ కేంద్రంలో ఇప్పటివరకు కేవలం 20 శాతం ధాన్యం మాత్రమే లిఫ్ట్ అయ్యిందని, మిగిలిన 80 శాతం ఇంకా కల్లాల్లోనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బషీరాబాద్‌లో కూడా లారీల సంఖ్యను పెంచాలని, ధాన్యం లారీలకు ఆటంకం కలగకుండా చూడాలని, అవసరమైతే మట్టి లేదా పెండ తరలించే వాహనాలను కూడా ధాన్యం రవాణాకే వాడాలని సూచించారు. ట్రాన్స్‌పోర్టర్ల నిర్లక్ష్యంపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. రైతులు పండించిన ప్రతి గింజనూ తరుగు లేకుండా ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయాలని, వర్షాల ముప్పు పొంచి ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన ధాన్యం తరలింపు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ముగిసిన 'జగదాంబ సమేత సేవాలాల్ మహారాజ్ మందిర ప్రతిష్టాపన' ఉత్సవాలు







కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 14 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండలంలోని (బిక్కనూర్) పోతుల గడ్డ రావుజి నాయక్ తండాలో ఈ నెల 12 నుంచి నిర్వహిస్తున్న శ్రీ శ్రీ జగదాంబ సమేత సేవాలాల్ మహారాజ్ మందిర ప్రతిష్టాపన ఉత్సవాలు ముగిసాయి. ఉత్సవాలలో చివరి రోజైన గురువారం ఉదయం 8 గంటలకు శాంతి పాఠము, ఆవాహిత దేవత పూజ, దేవత హవనము, మూలమంత్ర హోవనము, 8 గంటల 11 నిమిషాలకు పౌరాదేవి పీఠాధిపతి శ్రీశ్రీ బాబు సింగ్ మహారాజ్ చేతుల మీదుగా యంత్ర ప్రతిష్ట విగ్రహాభిషేకము, విగ్రహ ప్రతిష్ట,చండీ హోమము, అలంకరణ, ధూపదీప నైవేద్యము, మంగళహారతి, మంత్రపుష్పము, బలి, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కూడా చేశారు. నిజామాబాద్ కు చెందిన ఋగ్వేద ఘనపాఠి, వేద పండితులు జోషి మధుసూదన్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్టాపన ఉత్సవాలు జరిగాయి. చివరగా జోషి మధుసూదన్ శర్మ ను శాలువా పూలమాలతో తండా

## ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

కంఠేశ్వర్, మే 13: కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రైస్ మిల్ యజమానులకు సూచించారు. ఖానాపూర్‌లోని పలు రైస్‌మిల్లులను ఆమె బుధవారం తనిఖీ చేశారు. లక్ష్మీ బాలాజీ రైస్‌మిల్, శ్రీ సిద్ధి రామేశ్వర ప్రైవేట్ లిమిటెడ్ మిల్లులను సందర్శించిన ఆమె.. మిల్లులకు కొనుగోలు



కేంద్రాల నుంచి ఎన్ని లారీల ధాన్యం పంపించారు. దానిని దిగుమతి చేసుకున్నారా. ఎంత పరిమాణంలో మిల్లింగ్ చేశారనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిల్లుల వద్ద ఏమైనా తరుగు తీస్తున్నారా అని ఆరా తీశారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి విషయంలో జాప్యానికి తావు లేకుండా పకడ్బందీగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, సివిల్ సప్లయి డీఎం ప్రవీణ్, రైస్‌మిల్లుల నిర్వాహకులు మోహన్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

# బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి: పిడిఎస్‌యు డిమాండ్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 14:

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో బాధితురాలికి తక్షణమే న్యాయం చేయాలని పి డి ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ పట్టణంలోని నీలం రామచంద్రయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బాధిత మహిళ వారం రోజుల క్రితమే హైదరాబాద్‌లో పోలీసులను ఆశ్రయించినప్పటికీ, పాలకులు మరియు పోలీసుల నిర్లక్ష్యం వల్ల కేసు నమోదులో జాప్యం జరిగిందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ సమాజం నుండి తీవ్ర వ్యతిరేకత మరియు ఒత్తిడి వ్యక్తమయ్యాక మాత్రమే పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. కేసు నమోదైనప్పటికీ, అధికార బలంతో బండి సంజయ్ తన కొడుకును అరెస్ట్ కాకుండా కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని అనిల్ ఆరోపించారు.

బండి సంజయ్ తన కుమారుడి ప్రవర్తనకు నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చట్టం అందరికీ సమానమేనని చెప్పే పాలకులు, తమ పిల్లల విషయానికి వచ్చేసరికి చట్టాలను చుట్టాలుగా మార్చుకుంటున్నారని విమర్శించారు. చట్టాలు కేవలం పేద ప్రజలపై ప్రయోగించడానికేనా అని ప్రశ్నించారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వంద్వ




వైఖరి వీడి, సిట్ విచారణ నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని కోరారు. చట్టాన్ని గౌరవించకుండా తలదాచుకున్న బండి భగీరథ్‌ను పోలీసులు తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా దర్యాప్తుకు సహకరించాలని, లేనిపక్షంలో బాధిత మహిళకు అండగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, ప్రజా సంఘాలను ఏకం చేసి ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ విలేకరుల సమావేశంలో పిడిఎస్‌యు నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్క గణేష్, ఎల్.అనిల్, జిల్లా ఉపాధ్యక్షులు వైష్ణవి, నసీర్, నితిన్, జిల్లా సహాయ కార్యదర్శి సృజన్, మరియు జిల్లా నాయకులు దీపిక, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## బీసీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుగా

# వీహెచ్ బాధ్యతల స్వీకారం

## బీసీ సంక్షేమానికి వి.హనుమంతరావు

# సేవలు ఆదర్శం

### - వీహెచ్‌కు ప్రముఖుల అభినందనలు

**హైదరాబాద్, మే 14 (ప్రజా కలం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా బీసీ సంక్షేమ శాఖ బాధ్యతలు స్వీకరించిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి. హనుమంతరావుకు రాజకీయ, సామాజిక వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొని వీహెచ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి జనారెడ్డి మాట్లాడుతూ.. బీసీ వర్గాల సంక్షేమం కోసం వి.హనుమంతరావు దశాబ్దాలుగా నిరంతరం పోరాడుతున్నారని, ఆయనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారనే నమ్మకం ఉందన్నారు. బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం ఆయన అనుభవం ప్రభుత్వా నికి ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీసీ వర్గాల సమస్యలపై లోతైన అవగాహన కలిగిన నాయకుడు వి.హనుమంతరావు అని కొనియాడారు. ప్రభుత్వ పథకాలు అట్టడుగు వర్గాలకు చేరేలా ఆయన కీలక సూచనలు అందిస్తారని తెలిపారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించే నాయకుడిగా వీహెచ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. బీసీ వర్గాల అభివృద్ధికి ఆయన సలహాలు ప్రభుత్వానికి మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. ఓబీసీ చైర్మన్, ఎమ్మెల్యే శంకరయ్య, చీఫ్ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజ్ ఠాకూర్ తదితరులు కూడా వి.హనుమంత రావుకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, జిల్లా అధ్యక్షులు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకోగా, బీసీ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు.



ప్రభుత్వ సలహాదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వి. హనుమంతరావుని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్







## వి. హనుమంతరావుకు మంత్రి శ్రీధర్ బాబు శుభాకాంక్షలు

**హైదరాబాద్, మే 14 (ప్రజా కలం ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (బీసీ సంక్షేమం)గా సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం వి. హనుమంతరావు చేసిన సేవలు విశేషమని మంత్రి శ్రీధర్ బాబు కొనియాడారు. ఆయన అనుభవం, ప్రజా సమస్యలపై ఉన్న అవగాహన ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బీసీ సంక్షేమానికి సంబంధించిన పలు అంశాల్లో ఆయన సూచనలు మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ బీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రైతులను నిలువునా దోచుకుంటున్నారు

### -కష్టం రైతుది..లాభం మిల్లర్లదా..?
### -మిల్లర్లతో కుమ్మక్కంటూ ఆగ్రహం.
### -మూడు రోజుల్లో పరిష్కారం చూపాలి.
### -మాజీ ఎమ్మెల్యే పైళ్ళ హెచ్చరిక



**వలిగొండ మే 14 ప్రజాకలం:**

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని లింగరాజుపల్లి, మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి నెల రోజులు దాటిన కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు పడుతున్న బాధలు అంతా ఇంతా కాదని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులుగా ధాన్యం రాశులు అలాగే ఉండిపోవడం,లారీలు రాకపోవడం,మిల్లర్లు ధాన్యం ఎత్తకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల పక్షాన నిలవాల్సిన అధికారులు మిల్లర్లతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వర్షాల భయంతో రైతులు అందో ఆందోలన చెందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అదే విధంగా తూకంలో రెండు కిలోలు ఎక్కువగా కాంటాను వేస్తున్నారని,తరుగు పేరిట రైతును నష్టపరుస్తున్నారని అన్నారు. అలాగే మిల్లర్లు సైతం రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్,మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, మత్స్యగిరిగుట్ట మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సురకంటి వెంకటరెడ్డి,ఎలిమినేటి జంగారెడ్డి,వంగాల వెంకన్న,వలిగొండ పట్టణ అధ్యక్షులు మహ్మద్ అఫ్రోజ్ సర్పంచులు బొడిగె లింగస్వామి,ఆవుల నరసింహ,బలుగూరు నరేష్ రెడ్డి,పైళ్ల మల్లారెడ్డి,ఎడవల్లి శాంతి కుమార్, పోలెపాక సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.






# నవజాత శిశు సంరక్షణపై ప్రత్యేక శిక్షణ

### కార్యక్రమంలో పాల్గొన్న మెడికవర్ ఉమెన్ అండ్ చైల్ హాస్పిటల్స్ డాక్టర్లు, సిబ్బంది

**హైదరాబాద్, మే 14 (ప్రజా కలం ప్రతినిధి)**

నవజాత శిశు మరణాల రేటును తగ్గించి, ప్రతి బిడ్డకు సురక్షితమైన జీవనారంభాన్ని అందించాలనే లక్ష్యంతో నేషనల్ నియోనాటాలజీ ఫోరం (ఎన్ఎన్ఎఫ్) దేశవ్యాప్తంగా నిర్వహించిన ఎన్ఆర్పీ(నియోనాటల్ రిససిటేషన్ ప్రోగ్రామ్)డేలో మెడికవర్ ఉమెన్ అండ్ చైల్ హాస్పిటల్స్ చురుగ్గా పాల్గొన్నాయి. శిశువు జన్మించిన వెంటనే తలెత్తే శ్వాసకోశ ఇబ్బందులను అధిగమించేందుకు అవసరమైన అత్యవసర నైపుణ్యాలపై (లైఫ్ సేవింగ్ స్కిల్స్) వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించారు. ఎన్ఎన్ ఎఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ లల్లన్ కుమార్ భారతి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 998 కేంద్రాల నుంచి సుమారు 20వేల మంది వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ బృహత్తర శిక్షణ కార్యక్రమం నవజాత శిశు సంరక్షణ రంగంలో ఒక మైలురాయిగా నిలిచింది. హైదరాబాద్‌లోని మెడికవర్ ఉమెన్ అండ్ చైల్ హాస్పిటల్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీనియర్ నియోనే టల్ కేర్ స్పెష లిస్ట్ డాక్టర్ రవీందర్ రెడ్డి, కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ నవిత నేతృత్వం వహిం చారు. డాక్టర్ రవీందర్ రెడ్డి అండ్ నియో నాటాలజిస్ట్, హెచ్‌వోడీ నియోనాటాలజీ అండ్ పీడియాట్రిక్స్ మా ట్లాడుతూ 'శిశువు జన్మించిన



తర్వాత మొ దటి నిమిషం (గోల్డెన్ మినిట్) అత్యంత కీలకమైంది. ఆ సమయంలో శిశువు స్వయంగా శ్వాస తీసుకోలేకపోతే, సరైన వైద్య సహా యం అందించడం ద్వారా ప్రాణాపా యం నుంచి కాపాడవచ్చు. ఎన్ఆర్పీ శిక్షణ ద్వారా ప్రతి డెలివరీ సెంటర్‌లో నైపుణ్యం కలిగిన సిబ్బందిని సిద్ధం చేయడం మా లక్ష్యం', అని వివ రించారు. డాక్టర్ నవిత – నియోనాటాలజిస్ట్ అండ్ పీడియాట్రిషియన్ మాట్లాడుతూ వైద్య సిబ్బందికి అధునాతన ప్రాణరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణలో మెడికవర్ హాస్పిటల్స్ తన నిబద్ధతను చాటుకుంటోంది', అని పేర్కొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com